ఆదివారం

ప్రజాశక్తి

సెప్టెంబరు 14, 2003



ఎనీటైం మనీ
ఎ.టి.ఎమ్... పని

హ్యాపీ బర్త్‌డే (14-9-2003నుండి 20-9-2003వరకు)

పి. జ్యోతిక
సెప్టెంబర్
కావ్య- వినోద్‌కుమార్
అల్వాల్- సికింద్రాబాద్

జి. నిఖిల
2సం॥, 14. 9. 2001
సుధారాణి- నాగేశ్వరరెడ్డి
తురగావారిపాలెం- గుంటూరు

పి. జాహ్నవి
9సం॥, 15.9.1994
విజయలక్ష్మి-శివన్నారాయణ
ఎర్రమంజిల్ కాలనీ-హైదరాబాద్



ఎస్. తరుణ్‌కుమార్
2సం॥, సెప్టెంబర్-2001
సునీత-విజయ్‌కుమార్
చెన్నేకొత్తపల్లి- అనంతపురం

చంద్రలేఖ
5సం॥, సెప్టెంబర్-1998
తులసి- శరత్
భద్రాచలం-ఖమ్మం

జి. రాహుల్
1సం॥,16. 9. 2002
సంధ్యారాణి-ప్రేమ్‌రాజ్
జియాగూడా- హైదరాబాద్

ఫరహాన్
2సం॥, సెప్టెంబర్-2001
ఫర్జానాబేగం-నసీర్
అమరచింత-మ॥ నగర్

పవన్‌కుమార్
1సం॥, 16. 9. 2002
గీత- రంగస్వామి
హల్వి- కర్నూలు

సిహెచ్. ప్రభాత్
5సం॥, 17.9 .1998
సునంద- బాబూరావు
విజయవాడ

బి. దుర్గాభవాని
1సం॥ 17. 9. 2002
లత- గంగాధర్
జగిత్యాల-కరీంనగర్

సి. సాయిగణేష్
1సం॥, 18 .9 .2002
రంగనాయకి-సుబ్బారావు
కందుకూరు-ప్రకాశం

వి. స్ఫూర్తి
5సం॥18 .9 .1998
ఉష- వెంకట్రావు
వైరా- ఖమ్మం

పి. సూర్యకిరణ్
2సం॥, 18. 9.2001
మాధవి- దుర్గారావు
జయనగరకాలనీ-
హైదరాబాద్

జి. మౌనిక
2సం॥,18. 9 .2002
వెంకట్‌రావు
గాంధీనగర్- విశాఖపట్నం

శ్రావ్య
2సం॥, 18. 9. 2001
సుమ- శ్రీనివాసరెడ్డి
జీడిమెట్ల-హైదరాబాద్

వి. మున్నీ
3సం॥, 20. 9. 2000
బిందుమాధవి- ప్రసాద్
కమలాపురం- వరంగల్

బి. మల్లికాప్రియదర్శిని
1సం॥, 20. 9. 2002
పావని-వీరశేఖర్
దేవనకొండ- కర్నూల్

మనలో మాట

పాజిటివ్ మైండ్‌సెట్

నరకలోకంలో చిత్రగుప్తుడని ఒకడున్నాడు. వాడి దగ్గర ఒక చిట్టా ఉంటుంది. సమస్త ప్రాణికోటి పాపపుణ్యాలు అందులో నమోదు అవుతాయి. మనిషికి ఆయువు మూడగానే ఆ లోకం నుండి కింకరులొస్తారు. సదరు జీవిని నరకానికి లాక్కెళ్తారు. అక్కడ చిత్రగుప్తుడు ఖాతా పుస్తకం తెరిచి పాపపుణ్యాల పద్దును యమధర్మరాజుకు నివేదిస్తాడు. ఆయన వాటిని తూకం వేసి ఆ జీవిని నరకానికో, స్వర్గానికో పంపిస్తాడు. ఇదంతా మనకు సినిమాల్లోనో, పురాణాల్లోనో కన్పించేది. నిజంగా నరకం ఉందో లేదో మనకు తెలియదు. చచ్చినవాడెవడూ తిరిగివచ్చి మనకు ఫీడ్‌బ్యాక్ ఇవ్వలేదు. చిత్రగుప్తుడంటే మనకు తెలిసిందల్లా అల్లు రామలింగయ్యో, బ్రహ్మానందమో!

సరే..! అదెలా ఉన్నా భూలోకంలో ఒక లోకం ఉంది. అక్కడ చిట్టాలు, ఖాతా పుస్తకాలు ఉండవు. అక్కడ అన్నీ కంప్యూటర్లే! ఈ లోకంలో యముడు, చిత్రగుప్తుడు ఉండరు. అధినాయకుడు ఉంటారు. ఆ లోకపు జీవుల పాపపుణ్యాలన్నీ ఆయన కంప్యూటర్లో నమోదవుతాయి. అప్పుడప్పుడూ ఆయన ఎవడో ఒక అర్భకుడిని వలవేసి పట్టుకుంటారు. నీ చరిత్ర అంతా నా దగ్గరుంది ఖబర్దార్ అంటూ అదరకొడ్తారు. అతను ఎన్ని సమావేశాలకు హాజరయ్యాడు... ఏ కార్యక్రమాల్లో పాల్గొన్నాడు... వయస్సెంత... ఒడ్డూపొడుగు ఎంత... ఆడా ? మగా ? ఏ పదవిలో ఉన్నాడు... యోగాసనాలు వేస్తాడా ? ధ్యానం చేస్తాడా ? రోజూ భగవద్గీత చదువుతాడా ? తుమ్ముకు, దగ్గుకు, ఆవలింతకు జై జన్మభూమి అంటూ స్మరిస్తాడా లేదా వంటి వివరాలన్నీ కంప్యూటర్లో నిక్షిప్తమై ఉంటాయి. ఎవరి కులం ఏమిటి... ఎవడు ఎన్ని ఓట్లు తెస్తాడు వంటివి కూడా అందులో నమోదై ఉంటాయి.

అలాంటి కంప్యూటర్‌లో ఏ కమాండ్ పుణ్యమోగానీ హైకమాండ్ సన్నిహితుల, సచివుల తప్పిదాలు మాత్రం నమోదు కావు. తెలియక ఎవరైనా ఎంటర్ చేస్తే ఆ డేటా మొత్తం వెంటనే డస్ట్‌బిన్‌లో పడిపోతుంది. ఎవరెవరు ఎన్నికోట్లు సంపాదించారు ? ఎలా సంపాదించారు ? కరువు బియ్యం కాజేశారా ? సందుకో షాపు పెట్టి సారా అమ్మారా ? నకిలీ స్టాంపులు అమ్మి వందల కోట్లు సంపాదించారా వంటి వివరాల్ని అధినేత కంప్యూటర్ అస్సలు నమోదు చేయదు. పాపం అధినేత మాత్రం ఏం చేస్తారు ? అందుకని ఇలాంటి కేసులొస్తే త్రాసు దాచేస్తారు. పాపపుణ్యాల విచారణ నేను చేయను... అంతా కంప్యూటరే చూసుకుంటుంది అంటారు. మా లోకంలో అందరూ సచ్ఛీలురే అని ముందుగానే సర్టిఫికెట్ ఇస్తారు. కావాలంటే కంప్యూటర్ చూసుకోమంటారు! పాజిటివ్ మైండ్‌సెట్‌తో ఆలోచించి చూడండి అంతా సజావుగానే కన్పిస్తుంది అని దబాయిస్తారు. మీరు కూడా నేను చెప్పినట్లు కళ్ళు మూసుకుని ధ్యానం చేస్తుండండి. ఏదీ కన్పించదు. అంతా ప్రశాంతంగా ఉంటుంది అని సలహా ఇస్తారు. మనం కళ్ళు మూసుకొని ఉంటే మరింత 'సర్దేస్తారని' సందేహిస్తున్నారా... మరదే... పాజిటివ్ మైండ్‌సెట్ లేకపోవడమంటే... ●

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం	. . . 2
కవర్ స్టోరీ	. . . 3
ఆరోగ్యం	. . . 6
గేయలహరి	. . . 9
బాలవికాసం	. . . 10
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
కచేరి	. . . 14
ఇంతిసంగతులు	. . . 15
క్రీడారంగం	. . . 17
పుస్తక పరిచయం	. . . 20
రియల్ స్టోరీ	. . . 22
పలుకుబడి	. . . 24

ఇంకా...

చిన్నపిల్లలకు ప్రేమలా?

జీవనశైలి . . . 8

అందాల అంతర్వేది

టూరిస్ట్‌గైడ్ . . . 16

అమృత హృదయం

కథ . . . 18, 19

పండుగలే 'పడవ' చిత్రాలకు ప్రేరణ

కళాసాహితి . . . 21

కార్టూన్ కదంబం


ఏం.. నమ్మకం లేదా స్టాంపేపర్ పైన రాసివ్వనా?!
★ పూర్ణాంధ్ర సాధిస్తా
★ రైతు తర్వాతే ఎవరైనా
★ కోటి వరాలు
★ ఇంటికో ఉద్యోగం
★ నిరంతర కరెంటు, నీటి సౌకర్యం
★ మహిళాభ్యుదయం
నకిలీ స్టాంపుల కుంభకోణం


ఎన్డీఏ
వెళ్లారు, వచ్చారు, వెళ్లారు..
వెళ్లారు, వచ్చారు, వెళ్లారు..
వెళ్లారు, వచ్చారు, వెళ్లారు..
వెళ్లారు, వచ్చారు, వెళ్లారు..
వెళ్లారు, వచ్చారు, వెళ్లారు..
వెళ్లారు, వెళ్లారు..
వచ్చారు
మమత మేడం ఎన్నిసార్లు వెళ్లారో వచ్చారో లెక్క వేస్తున్నా సార్!!


'ఉత్తమ నటుడి' అవార్డ్ ఈయనకిస్తే.. సరిపోయేది!!
ఇద్దరు హీరోలకు ఉత్తమ నటుడు అవార్డ్
స్టాంపుల కుంభకోణం సంగతి నాకేం తెలియదు బాబు..

బ్యాంకు పని వేళల్లోనే డబ్బు అనేది ఒకప్పటి మాట. ఎనీటైం మనీ అనేది నేటి నినాదం. ఇప్పుడు మీ బ్యాంకు ఖాతాలో డబ్బు ఉండాలేగానీ వారంలో ఏడు రోజులూ 24 గంటలూ మీకు డబ్బు తీసుకునే సదుపాయం ఉంది. నేటి ఆధునిక బ్యాంకింగ్ ప్రక్రియల్లో ఒకటైన ఎ.టి.ఎమ్. ద్వారా ఇది సాధ్యపడుతోంది. దశాబ్దం క్రితమైతే మీ బ్యాంకు ఖాతాలో ఎంత డబ్బు వున్నా బ్యాంకు పనివేళలు మించిపోతే మరుసటి రోజు వరకూ వేచి ఉండాల్సిందే. మరీ ప్రాణం మీదకి వస్తే ఎక్కడైనా అప్పుకోసం పరుగెత్తడం మినహా మరో మార్గం ఉండేది కాదు. నేటి పరిస్థితి అది కాదు.

ఎనీ టైం మనీ ఎ.టి.ఎమ్. పని

ఎ.టి.ఎమ్. లేదా డెబిట్ కార్డులను ఉపయోగించి ఏ సమయంలోనైనా డబ్బును తీసుకోవచ్చు, డిపాజిట్ చేయవచ్చు లేదా మరొక ఎకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ కూడా చేయవచ్చు. మన ఎకౌంట్‌లో డబ్బులుండాలే కానీ అర్ధరాత్రి ఒంటిగంటకైనా డబ్బులు తీసుకోవచ్చు.

1970వ దశకం ప్రారంభంలో ఎటిఎమ్‌లను తొలుత బ్యాంకులోపలో, బ్రాంచీలలో మాత్రమే నెలకొల్పారు. వీటిని కేవలం బ్యాంక్ ఉద్యోగస్తుల సంఖ్యను కుదించుకునే ఉద్దేశంతోనే ప్రారంభించారు. 1970-80ల మధ్య జరిగిన కంప్యూటరీకరణతో వీటిని నెలకొల్పటం మరింత సులువైంది. తొలుత చెక్కులు, డబ్బు, మెషీన్ల ద్వారా డిపాజిట్ చేయడానికి భయాందోళనలకు గురవుతున్న వారిని ప్రోత్సాహకాల ద్వారా ఉత్తేజపరిచే ప్రయత్నాన్ని బ్యాంకులు చేశాయి. కాలక్రమేణా "హ్యూమన్ టెల్లర్ ఫీజుల" పేరుతో ఎటిఎమ్‌లను వాడని వారిపై ఛార్జీలు వసూలు చేశాయి. ఈ ఎ.టి.ఎమ్.లను మొదట్లో ఆ బ్యాంకుల్లో ఎకౌంట్లుండి, కార్డులున్న వారు మాత్రమే వినియోగించుకునే వారు. ఎ.టి.ఎమ్.లున్న బ్యాంకులు గణనీయంగా పెరిగిన తర్వాత, తమ నెట్‌వర్క్‌లను ఇతర బ్యాంకుల నెట్‌వర్క్‌లతో అనుసంధానం చేశారు. దీనితో ఏ బ్యాంకు ఎటిఎమ్‌కైనా వెళ్ళి డబ్బును

ఎ.టి.ఎమ్. రూపకర్త డాన్ వెట్జెల్

నేడు ఏ సమయంలోనైనా డబ్బును ఎకౌంట్ నుండి డ్రా చేసుకునే అవకాశాన్ని కల్పించిన ఎ.టి.ఎమ్.లు డాన్ వెట్జెల్ ఆలోచనే. 1968లో అమెరికాలోని ఒల్లాస్ నగరంలో డబ్బు తీసుకునేందుకు లైన్‌లో నిలబడి ఎదురు చూడాల్సి వచ్చినప్పుడు తట్టిన ఆలోచనే నేటి ఎ.టి.ఎమ్.ల రూపకల్పనకు కారణమైంది. ఆనాటికి వెట్జెల్ డాక్యుటెల్ కంపెనీలో నూతన ఉత్పత్తుల తయారీ విభాగానికి మేనేజర్‌గా పని చేస్తున్నారు. డాన్ వెట్జెల్‌తో పాటు మెకానికల్ ఇంజనీరైన టామ్ బార్నెర్స్, ఎలక్ట్రికల్ ఇంజనీర్ జార్జ్ ఛాస్టియన్‌లు పని చేశారు. 1968లో పనిని ప్రారంభించి 1969 నాటికి పని చేస్తున్న ఒక నమూనాను తయారు చేశారు. న్యూయార్క్‌లోని కెమికల్ బ్యాంక్‌లో మొట్టమొదటి ఎ.టి.ఎమ్.ను నెలకొల్పారు. ప్రారంభించిన రోజుల్లో డబ్బును చెల్లించే పని మాత్రమే సాధ్యమయ్యింది. 1971లో పరిపూర్ణమైన ఎ.టి.ఎమ్.ను ప్రారంభించారు. దీనిలో డబ్బును డిపాజిట్ చేసుకునే సౌకర్యం, ఎకౌంట్‌లో ఎంత డబ్బు వుంది చూసుకునేటటువంటి సౌకర్యాలనేకం వున్నాయి.

ఏటిఎమ్‌లు ఎలా పని చేస్తాయి ?

దబ్బు అవసరమైనప్పుడు ఆటోమేటెడ్ టెల్లర్ మెషీన్ (ఎ.టి.ఎమ్.) వద్దకు వెళ్ళి కార్డు పెట్టి, ఒక క్షణం ఆగి దబ్బు తీసుకుని, రిసిప్ట్ తీసుకుని హడావుడిగా వెళ్ళిపోతూ ఉంటాం. నేడు ఈ మెషీన్లు సూపర్ మార్కెట్ల వద్ద, కూడళ్ళ వద్ద, పెట్రోలు బంకుల్లోనూ... చెప్పుకుంటూ పోతూ వుంటే ప్రపంచమంతా వ్యాపించి వున్నాయి. ఇవి పని చేసే విధానం ఏంటి? మనం రాష్ట్రంలోనో, దేశంలో ఏ ప్రాంతం నుండైనా దబ్బును ఎకౌంట్‌లో వేస్తే ఎలా జమవుతుంది ? అనే సందేహాలు వచ్చే వుంటాయి.

ఈ ఎ.టి.ఎమ్.ల నెట్‌వర్క్‌ను మనం ఇంటర్నెట్‌తో పోల్చవచ్చు. ఎ.టి.ఎమ్. కూడా సమాచారాన్ని ఫీడ్ చేసేటువంటి ఒక కంప్యూటర్ వంటిదే. ఈ ఎ.టి.ఎమ్. హోస్ట్ ప్రాసెసర్‌తో కనెక్ట్ అయి వుంటుంది. హోస్ట్ ప్రాసెసర్‌ను ఇంటర్నెట్ గేట్‌వేతో మనం పోల్చవచ్చు. ఎ.టి.ఎమ్. ఈ హోస్ట్ ప్రాసెసర్ ద్వారా బ్యాంక్ కంప్యూటర్‌తో లీజ్డ్ లైన్ నెట్ వర్క్ ద్వారా అనుసంధానమై ఉంటుంది. లీజ్డ్ లైనంటే ఈ తరహా సమాచారాన్ని చేర్చేందుకు మాత్రమే వినియోగిస్తున్న కనెక్షన్లు.



ఎ.టి.ఎమ్. వద్ద జరిగే ప్రక్రియనంతటినీ కంప్యూటర్ వద్ద జరిగే ప్రక్రియతో పోల్చవచ్చు. కంప్యూటర్ ఏ రకంగానైతే మనమిస్తున్న ఇన్‌పుట్‌ను పరిశీలించి అవుట్‌పుట్ ఇస్తుందో అదే పద్ధతిలో మనం కార్డును ఎ.టి.ఎమ్.లో పెట్టినప్పుడు మనం అడిగిన ప్రక్రియను (దబ్బును డ్రా చేయడం, డిపాజిట్ చేయడం వంటివి) చేపడుతుంది. మనం దబ్బును డ్రా చేయమని అడిగినప్పుడు (ఇన్‌పుట్) మన ఎకౌంట్ బ్యాలెన్స్ చూసి దబ్బును చెల్లిస్తుంది (ఔట్‌పుట్).



కార్డ్ రీడర్ : కార్డ్ వెనుక భాగంలోని అయస్కాంతపు టేప్ మీద నిక్షిప్తమైన సమాచారాన్ని పరిశీలించేందుకు ఉపయోగపడుతుంది. హోస్ట్ ప్రాసెసర్ ఈ సమాచారం ఆధారంగానే ఏ బ్యాంక్ కంప్యూటర్ ను సంప్రదించాలో నిర్ణయిస్తుంది. కీ ప్యాడ్ ద్వారా కార్డ్ గల వ్యక్తి బ్యాంక్‌కు తాను ఏ రకమైన ప్రక్రియ చేపట్టదలచుకున్నాడో తెలియచేస్తాడు. (దబ్బును డ్రా చేయటం, డిపాజిట్ చేయటం) దీనిని మనం కంప్యూటర్‌లోని కీబోర్డుతో పోల్చి చూడవచ్చు. డిస్‌ప్లే స్క్రీన్‌లో మనం చేస్తున్న లావాదేవీల (ట్రాన్సాక్షన్)ను చూడగలము. దీన్ని కంప్యూటర్ మానిటర్‌తో పోల్చి చూడవచ్చు. మనం దబ్బును వసూలు చేసుకునే కాష్ డిస్పెన్సర్ ఎ.టి.ఎమ్.కు గుండెకాయ వంటిది. ఎ.టి.ఎమ్. దిగువ భాగమంతా దబ్బుతో నిండి ఉంటుంది. ఎ.టి.ఎమ్. వద్ద మనం దబ్బును తీసుకుంటున్నప్పుడు, హోస్ట్ ప్రాసెసర్ మనకు కార్డు ఇచ్చిన బ్యాంకును సంప్రదిస్తుంది. బ్యాంక్ ఎకౌంట్ దిగువ భాగమంతా కరెన్సీతో నిండి ఉంటుంది. ఎ.టి.ఎమ్. వద్ద మనం దబ్బును తీసుకుంటున్నప్పుడు, హోస్ట్ ప్రాసెసర్‌తో మనకి కార్డు ఇచ్చిన బ్యాంకును సంప్రదిస్తుంది. బ్యాంక్ ఎకౌంట్ పూర్తి సమాచారాన్ని పరిశీలించి హోస్ట్ ప్రాసెసర్‌కు దబ్బును ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫర్ చేస్తుంది. హోస్ట్ ప్రాసెసర్ నుండి నిక్షిప్త సంకేతాలు అందిన తర్వాత క్యాష్ డిస్పెన్సర్ ద్వారా దబ్బు మనకు అందుతుంది. ఒక బ్యాంక్ ఎ.టి.ఎమ్. ద్వారా వేరొక బ్యాంక్ నుండి దబ్బు తీసుకోవాలనుకుంటున్నప్పుడు హోస్ట్ ప్రాసెసర్ ద్వారా సంబంధిత బ్యాంకును సంప్రదించి డిస్పెన్సర్ ద్వారా దబ్బు అందుతుంది. మరుసటి రోజున రెండవ బ్యాంకు మొదటి బ్యాంకుకు దబ్బును జమ చేస్తుంది.



గ్రామాల్లోనూ ఎ.టి.ఎమ్.లు

దేశ వ్యాపితంగా నేడు 2003 ఎ.టి.ఎమ్. సెంటర్లతో రాబోయే సంవత్సరం మార్చి నెలాఖరుకల్లా 3000 సెంటర్ల మైలురాయిని దాటుతామంటున్నారు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ (ఎ.టి.ఎమ్.) శ్రీమతి టి.పి.సుభాషిణి. మన రాష్ట్రంలో ప్రస్తుతం 54 కేంద్రాల్లో 159 సెంటర్లనేర్పాటు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 120 సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎకౌంటున్న వాళ్ళకి అదనపు ఛార్జీలు లేకుండా ఎ.టి.ఎమ్.లను ఇస్తున్న ఏకైక బ్యాంక్ ఎస్.బి.ఐ. అని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో తమ బ్యాంకులో ఎ.టి.ఎమ్. కార్డులు తీసుకున్న వారి సంఖ్య 25 లక్షలని తెలిపారు. చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల వరకు తమ ఎ.టి.ఎమ్. సెంటర్లు విస్తరించాయని, సామాన్యునికి ఎ.టి.ఎమ్.లను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. ఎ.టి.ఎమ్.ల మీద ఉన్న అపోహలను తొలగించటానికి క్యాంపెయిన్‌లను చేపడుతున్నామన్నారు. ఎ.టి.ఎమ్. సెంటర్ నెలకొల్పిన ప్రతిచోటా అవేర్‌నెస్ క్యాంపెయిన్‌లను చేపట్టామన్నారు. లాభదృష్టి మాత్రమే కాకుండా యావత్ ప్రజానీకానికి ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావటం తమ లక్ష్యమన్నారు. 95 శాతం వరకు ఎ.టి.ఎమ్. సెంటర్లలో టచ్ స్క్రీన్లను ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని బ్యాంకులలో కూడా కంప్యూటరీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. కంప్యూటరీకరణ పూర్తయిన ప్రతీచోటా ఒక ఎ.టి.ఎమ్.ను ఏర్పాటు చేస్తామన్నారు.

తీసుకోవచ్చు. తమ బ్యాంకు ఎటిఎమ్ నుండి వేరే బ్యాంకులలో జరిపే లావాదేవీలన్నింటి మీద ఛార్జీలను వసూలు చేయడం ద్వారా పని చేస్తున్నాయి.

ప్రపంచ వ్యాపితంగా నేడు సుమారు 8 లక్షల ఎ.టి.ఎమ్. సెంటర్లున్నాయి. భారతదేశంలో ఎ.టి.ఎమ్.ల సంఖ్య 6700 వరకు ఉన్నాయి. మన దేశంలో ఎ.టి.ఎమ్.ల వ్యవస్థాపన 80వ దశకం చివరిలో ప్రారంభమైంది. మన దేశంలోని మొట్టమొదటి ఎ.టి.ఎమ్. సెంటర్‌ను హెచ్.ఎస్.బి.సి. బ్యాంకు 1987లో నెలకొల్పింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్.బి.ఐ.) భారతదేశంలో 2000 పైన ఎ.టి.ఎమ్. సెంటర్లతో మొదటి స్థానంలో ఉన్నది రాబోయే 18 నెలల్లో మరో 1000 కేంద్రాల్లో ఎ.టి.ఎమ్.లను నెలకొల్పాలని నిర్ణయించింది. రెండవ స్థానంలో 1700పైన కేంద్రాలతో ఐ.సి.ఐ.సి.ఐ. బ్యాంక్ వున్నది. మన దేశంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో (ఐ.టి.) కంపెనీలైన టి.సి.ఎస్., ఐ.బి.ఎమ్., ఐ-ఫ్లెక్స్ వంటి కంపెనీలతో ఒప్పందాలకు బ్యాంకులు మొగ్గు చూపాయి. నేడు ఎ.టి.ఎమ్.లను కేవలం డబ్బును డ్రా చేసుకోవటానికి మాత్రమే వినియోగిస్తున్నారు. ఎ.టి.ఎమ్.ల ద్వారా ఒనగూడే ఇతర సౌకర్యాలపై వినియోగదారులను మరింత చైతన్యవంతుల్ని చేయాల్సి వుంది. కానీ సాంకేతిక [illegible] ఈ నూతన అధ్యాయం మహానగరాలకు, పట్టణ ప్రాంతాలకు మాత్రమే పరిమితమైంది. ఉన్న ఎ.టి.ఎమ్. సెంటర్లు కూడా సూపర్ మార్కెట్లు, పెట్రోలు బంకులు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాల వద్ద నెలకొల్పుతున్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి జాతీయ బ్యాంకుల చొరవతో

మొబైల్ ఎ.టి.ఎమ్.లు

ఐ.సి.ఐ.సి.ఐ. బ్యాంక్ ఆధ్వర్యాన మొబైల్ ఎ.టి.ఎమ్. కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఒక దగ్గర చేరే కేంద్రాల వద్ద సౌకర్యాలందించటానికి వీటిని ఏర్పాటు చేశారు. ఒక వ్యాన్‌లో ఎ.టి.ఎమ్. సెంటర్ ఉంటుంది. ఇది వి-శాట్ ద్వారా తమ ఎ.టి.ఎమ్. నెట్‌వర్క్‌లో అనుసంధానమై ఉంటుంది. ఈ తరహా ఎ.టి.ఎమ్. సెంటర్లు వ్యానులో ఉన్నప్పటికీ ఇతర చోట్ల ఉన్న ఎ.టి.ఎమ్. సెంటర్‌లోని అన్ని సదుపాయాలు ఉంటాయి.

చిన్న పట్టణాల్లో కూడా వీటిని స్థాపిస్తున్నారు. ఎ.టి.ఎమ్.లను వాడుతున్న వారిలో అత్యధిక భాగం వున్నత వర్గాలకు చెందిన వారని, వీరి సగటు వయసు 31 సంవత్సరాలని పూణేకు చెందిన రినెసాన్స్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ సంస్థ అధ్యయనంలో వెల్లడైంది. వీరిలో ఎక్కువ మంది నూతన టెక్నాలజీతో తయారైన వినిమయ వస్తువులను వాడుతున్న వారేనని ఈ సంస్థ పేర్కొన్నది.

ఏ క్షణంలో కావాలంటే ఆ క్షణంలో డబ్బు అందించేందుకు ఎ.టి.ఎమ్. సెంటర్లున్నాయి. (ఎకౌంట్‌లో డబ్బుంటే) కానీ అది కేవలం ఒక వర్గం మాత్రమే ఉపయోగించుకోగలుగుతున్నది.



అంధులకు ఎ.టి.ఎమ్. సెంటర్లు

అంధులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు బ్రెయిలీ కీ-పాడ్ ఉన్నటువంటి ఎ.టి.ఎమ్.లను ప్రారంభించింది. బ్రెయిలీ కీ-పాడ్‌తో పాటు ఒక హెడ్‌ఫోన్ ఎ.టి.ఎమ్.కు అమర్చి ఉంటుంది. సంకేతాలను ఇంగ్లీషు, హిందీ రెండు భాషల్లో వినేందుకు అవకాశముంది. బ్రెయిలీ లిపిలో టైపు చేసిన దాన్ని బట్టి కార్డు పెట్టడం నుండి డబ్బు తీసుకునే వరకు హెడ్‌ఫోన్‌లో కోరుకున్న భాషలో సంకేతాలనిస్తుంది.

డా॥ కె.ఎల్.వి.ప్రసాద్

సౌందర్యం పెంచుకోవడానికి ఈ రోజున ఎన్నో సౌందర్య సాధనాలు విపణిలో రాజ్యమేలుతున్నాయి. సౌందర్యం పెంపొందించుకోవడానికి, చికిత్స విధానాలు కూడా ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. చికిత్సకయ్యే ఖర్చును గురించి ఆలోచించకపోతే ఇది అందరికీ అందుబాటులో వున్న చికిత్సగానే భావించాలి. శరీర సౌందర్యం గురించి ఆలోచించే వాళ్ళు, దంత సౌందర్యం గురించి తప్పక ప్రత్యేకంగా ఆలోచిస్తారు.

ఈ రోజున దంత సౌందర్య చికిత్సా విధానాలు యువతీ, యువకులకే కాదు వృద్ధులకు సైతం అందుబాటులో వున్నాయి. వృద్ధుల గురించి ఆలోచించే పరిస్థితులు తగ్గుముఖం పడుతున్న ఈ రోజుల్లో, వృద్ధుల దంతాల గురించి, దంత సౌందర్యం గురించి ప్రత్యేకంగా ఆలోచించవలసిన అవసరం వుంది. స్త్రీ, పురుష భేదం లేకుండా వృద్ధుల దంత సౌందర్యం గురించి ఆలోచించినప్పుడు ప్రధానంగా గుర్తుకు వచ్చే ఆధునిక దంత సౌందర్య చికిత్సా విధానానికి 'ఇంప్లాంట్ డెంచర్స్' మంచి సమాధానం.







వదులు కాని కట్టుడు పళ్ళే ఇంప్లాంట్ డెంచర్లు!!

'ఇంప్లాంట్ డెంచర్స్' అనేవి కేవలం వృద్ధులు మాత్రమే చేయించు కోవాలనేది ఈ వ్యాసం ఉద్దేశం కాదు. ఎవరైతే దవడలలో దంతాలను కోల్పోతారో వారు ఈ రకపు కట్టుడు పళ్ళను ఆశ్రయించవచ్చు. వృద్ధాప్యం వచ్చేసరికి సాధారణంగా దంతాలను కోల్పోతారు కాబట్టి, బ్రతికినంతకాలం ఆరోగ్యంగా ఉండాలంటే, ఆహార పదార్థాలు నమలగలగాలి. కాబట్టి దానికోసం ఇటు నమిలే పని చేయడానికి, అటు ఆకర్షణీయంగా కన్పించడానికి ఇంప్లాంట్ డెంచర్లు ఉపయోగపడ్తాయనేది సత్యం!

అసలు ఇంప్లాంట్ డెంచర్లు అంటే ఏమిటి? దవడ అంతర్భాగంలో ఆధారాలను దింపి వాటి సహకారంతో కట్టుడు పళ్ళను అమర్చడాన్ని 'ఇంప్లాంట్ డెంచర్స్' అంటారు.

ఇంప్లాంట్స్ అనేవి లోహ సంబంధమైన లేదా సిరామిక్ సంబంధమైన మేకుల వంటి ఆధారాలు. వాటిని శస్త్రచికిత్స ద్వారా దవడ లోపలి భాగంలో అమర్చడం జరుగుతుంది. శస్త్రచికిత్స ద్వారా ఈ ఆధారాలను దడ ఎముకలలో దింపినప్పుడు, ఎముక పదార్థం ఆధారాలపై కూడా పెరిగి, క్రమంగా దవడ ఎముకలో పటిష్టంగా నిలబడడానికి ఆస్కారం ఏర్పడుతుంది. కనుకనే వీటిపై అమర్చే కట్టుడు పళ్ళు గట్టిగా కదలకుండా ఉంటాయి.

ఇంప్లాంట్ డెంచర్లు సాధారణంగా దవడ బాగా అరిగిపోయి కట్టుడు పళ్ళ సెట్టు నిలకడగా నిలబడలేని శక్తి గల వారికే ప్రధానంగా నిర్దేశించబడ్డాయి. మాట్లాడినా, నవ్వినా కట్టుడు పళ్ళు ఊడి బయటపడ్తాయని భయపడ్తున్న వాళ్ళు ఈ ఇంప్లాంట్ డెంచర్లను ఆశ్రయిస్తారు. దవడ ఎముక బాగా ఉండి, కట్టుడు పళ్ళను గట్టిగా పట్టి ఉంచే శక్తిగల వారికి ఇంప్లాంట్ డెంచర్ల అవసరం రాదు.

ఇంప్లాంట్ డెంచర్ల చికిత్స అధిక వ్యయంతో కూడుకున్నది. ఇది సామాన్యులకు అందుబాటులో లేని చికిత్సా విధానం. పైగా అందరికీ ఈ చికిత్స అనువుగా వుండదు. ఈ చికిత్సకు అందరి ఆరోగ్యం సహకరించకపోవచ్చు. అయినప్పటికీ ఈ ఆధునిక చికిత్సా విధానం గురించి కొద్దో-గొప్పో తెలుసుకోవడం తప్పు కాదు.

"ఇంప్లాంట్" (ఆధారపు మేకు) అనేది రెండు ముఖ్య

భాగాలను కలిగి ఉంటుంది. మొదటి భాగం దవడ లోపల మునిగి ఉంటుంది. రెండవ భాగం దవడ బయట చిగురు మీద ఉండి కట్టుడు పళ్ళను గట్టిగా పట్టుకొని ఉంటుంది. పొడుగ్గా - గుండ్రంగా వుండే ఈ ఆధారాలు సాధారణంగా అమూల్యమైన లోహాలతోను, లోహమిశ్రమాలతోను తయారు చేస్తారు. దీనికోసం సాధారణంగా ఉపయోగించే లోహం 'టైటానియం' లేదా దానితో కూడిన ఇతర లోహ మిశ్రమం ఈ లోహం సాధారణంగా శరీర కణజాలంతో కలిసిపోయే లక్షణం కలిగి ఉండడమే ఈ లోహాన్ని ఉపయోగించడంలో గల ప్రధాన ఉద్దేశం. ఈ ఆధారాలు ఎముక పదార్థంతో కలిసిపోవడానికి వీలుగా వాటికి 'హైడ్రాక్సి అపిటైట్' కాని, 'టైటానియం ప్లాస్మా'ను గాని పూతగా పూస్తారు.

ఇంప్లాంట్ డెంచర్లు తయారు చేయడానికి రెండు దశల కార్యక్రమం ఉంటుంది. ఆధారానికి సంబంధించిన కింది భాగం శస్త్రచికిత్స ద్వారా ఎముక భాగంలో అమర్చడం మొదటి దశగా చెప్పవచ్చు. శస్త్ర చికిత్స చేసే భాగాన్ని తిమ్మిరి చేయడం ద్వారా (లోకల్ ఎనస్థీషియా) గాని, మొత్తం శరీరాన్ని తిమ్మిరి చేయడం ద్వారా (జనరల్ ఎనస్థీషియా) కాని ఈ శస్త్ర చికిత్స చేయబడుతుంది. ఈ చికిత్స జరిగిన తరువాత ఇంప్లాంట్ అనబడే ఆధారం ఎముక భాగంలో కలిసిపోవడానికి ముందు నుంచి ఆరు నెలల సమయం పట్టవచ్చు. ఈ దశలోనే ఇది కొంతమందికి ఇబ్బందులను కూడా కలిగించవచ్చు. ఈ పరిస్థితులలో చికిత్సను కొనసాగించాలా? వద్దా? అన్నది దంత వైద్యులు నిర్ణయం తీసుకుంటారు.

శస్త్ర చికిత్సకు సంబంధించిన పుండు మానిన తరువాత రెండవ దశ ప్రారంభం అవుతుంది. ఆధారాలపై కట్టుడు పళ్ళను అమర్చడమే రెండవ దశ. ఈ ఇంప్లాంట్ డెంచర్స్ అనేవి ముందు చెప్పినట్లుగా పూర్తిగా దంతాలు కోల్పోయిన వారికి అధికంగా ఉపయోగపడినప్పటికీ, ఒకటి అంతకంటే ఎక్కువ దంతాలను కోల్పోయిన వారు కూడా ఇంప్లాంట్ డెంచర్లను అమర్చుకునే సదుపాయం ఈనాడు అందుబాటులోనికి వచ్చింది.

అయితే అనుకున్న వారందరూ ఇంప్లాంట్ డెంచర్లను వాడుకునే అవకాశం లేదు. ఈ చికిత్సకు, మంచి నోటి పరిశుభ్రత, ఆరోగ్యమైన దవడ, మంచి శరీర ఆరోగ్యం అనేవి అనుకూల పరిస్థితులు. రక్తపరీక్షల ద్వారా, ఎక్స్-రేల ద్వారా దవడ ఆరోగ్య పరిస్థితిని లెక్కగట్టిన తరువాతనే ఈ చికిత్స సాధ్యమవుతుంది. ఏవైనా శారీరక సమస్యలతో బాధపడుతున్న వారికి 'ఇంప్లాంట్ డెంచర్లు' చికిత్స చేసే అవకాశం ఎట్టి పరిస్థితిలోను ఉండదు. ఉదాహరణకు, అదుపులోకి రాని మధుమేహ వ్యాధిగ్రస్తులు ఈ చికిత్సకు అర్హులు కారు. అలాగే రక్తసంబంధమైన వ్యాధులు ఉన్నవాటికి కూడా ఈ చికిత్స చేసే అవకాశం లేదు. ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఆలోచిస్తే, సామాన్య ప్రజానీకానికి ఇది అందుబాటులో ఉన్న వైద్యం కానే కాదు! అయితే రానున్న రోజుల్లో ఇది అతిపేద వారికి సైతం అందుబాటులోనికి వచ్చే అవకాశాలు లేకపోలేదు.

ఏది ఏమైనప్పటికీ, యవ్వనంలోగాని, వృద్ధాప్యంలోగాని, ప్రమాదరీత్యాగాని, వయస్సును బట్టిగాని, దంతవ్యాధుల వల్ల గాని దంతాలను కోల్పోయిన వారికి ఇంప్లాంట్ డెంచర్లు హాయిగా నవ్వడానికి, అందంగా మాట్లాడడానికి, ఆకర్షణీయంగా కన్పించడానికి చక్కని సౌందర్య సాధనాలుగా మనకు అందుబాటులోకి వచ్చాయి.

(ద హిందూ సౌజన్యంతో)

హెచ్.ఐ.వి. - ఈగలు

హెచ్.ఐ.వి. వైరస్ చింపాంజీల నుండి ఒకరకమైన ఈగల ద్వారా 20వ శతాబ్దంలో మానవులలోనికి ప్రవేశించి వుండవచ్చునని జర్మన్ సైంటిస్ట్‌లు న్యూ సైంటిస్ట్ పత్రికలో ప్రచురించారు. అయితే ఇప్పుడు 90 శాతం ఈ వైరస్ సెక్స్‌మూలంగానే వ్యాప్తి చెందుతోందని, అన్నిరకాల ఈగల వలన ఇది వ్యాప్తి చెందదని కనుక ఈగలు, దోమల వంటివాటికి జడియవలసిన పనిలేదని, సురక్షితమైన సెక్స్‌నుండి మాత్రమే ఈ వ్యాధులను దరిచేరకుండా చేయుడం సాధ్యమని లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్, ట్రాపికల్ మెడిసిన్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ డేవిడ్ మాబే తెలిపారు.

పొంగు

పొంగు చాలా తేలికగా వచ్చే అంటువ్యాధి. ఇంట్లో ఉన్న పిల్లల్లో ఒకరికి వస్తే దాదాపు అందరికీ వచ్చేస్తుంది.పొంగువ్యాధి ఊరిలో కనబడిన తరువాత వాక్సిన్ ఇస్తే అంతగా ప్రయోజనముండదు. పొంగువచ్చిన పిల్లవాని దగ్గు, తుమ్ముల ద్వారా వ్యాధి క్రిములు వ్యాపిస్తాయి. అందువల్ల ఊరిలో పొంగు కనబడిన తరువాత నిరోధక చర్యగా "గామాగ్లోబ్యులన్" ఇంజక్షన్లు చేయించుకొనవచ్చును. ఆ సమయంలో వాక్సిన్‌ల వలన అంతగా ఉపయోగం ఉండదు. అందువలన ముందుగానే వాక్సిన్ తీసుకొనుట ద్వారా పొంగు బారినుండి రక్షించుకొనవచ్చును.

✻ ముదిగంటి సుజాతారెడ్డి

చిన్నపిల్లలకు ప్రేమలా?



"అబ్బబ్బ చస్తున్నానే!" అంది లలిత కుర్చీలో కూలబడుతూ.

"మళ్ళా ఏమొచ్చిందే?" అడిగాన్నేను.

"ప్రేమ! ప్రేమ! ప్రేమ!.... ఎక్కడ చూసినా ప్రేమే!" లలిత నొసటి మీద అరచేతితో బాదుకుంది నాటకీయంగా.

"అబ్బ! ప్రేమ సంగతేమిటో సరిగ్గా చెప్పవే. ఎవరు ఎవర్ని ప్రేమించారు. ఏమైంది?"

"సినిమాల్లోనే... ప్రేమ చిన్నప్పట్నుంచే పుట్టినట్టు చూపిస్తున్నారు. ఇంతంత చిన్నారుల్లోనే ఇష్టం, త్యాగం, తెగింపు అన్నీ వుంటున్నాయి. రెండు మూడేండ్లు!... ఐదారేండ్లు!... అంతే అప్పుడే ప్రేమ మొదలవుతుంది. ఒక్కొక్కసారి ఆ పిల్లలు గర్భంలో వున్నప్పుడు తల్లిదండ్రులు పెళ్ళి ఒప్పందాలు చేసుకున్నట్లుగా కూడా చూపించారని నాకు గుర్తుంది. సరే తొట్టెల్లో ఊగుతున్న పసిపిల్లలకు పెళ్ళిళ్ళు చూపిస్తున్నారే. ఈ అనంతమైన ప్రేమ ప్రదర్శనలతో చస్తున్నాననుకో!" అంది లలిత యాష్టపడుతూ.

"మధ్యలో నీకెందుకే ఇంత యాష్ట. డబ్బు చేసుకునేందుకు సినిమావాళ్ళు ఏవో బాధలు పడ్తుంటారు. ఒకర్ని మించి ఒకరు చిన్నపిల్లలు ప్రేమలో పడ్డట్లుగా వింతవింత దృశ్యాలు, మాటలు, పాటలు సృష్టిస్తున్నారు. వాళ్ళ సృజనాశక్తికి మనం మెచ్చుకోవాల్నే లల్లీ!" అన్నాన్నేను.

"నాకు యాష్ట యెందుకని సినిమావాళ్ళను మెచ్చుకుంటున్నావా? వాస్తవికత వుండాలి, వాస్తవికత వుండాలి అని వల్లించే దానివి. ఇవ్వాళ ఏమైంది నీకు! అంత అసహజమైన ప్రేమలు సృష్టించి ఒక సినిమా తరువాత ఒక సినిమాను మన మీద రుద్దుతున్న వాళ్ళను సృజనాశక్తి అంటూ మెచ్చుకుంటున్నావా? అసలు నువ్వునువ్వేనా?" అంది లలిత అనుమానంగా నా వైపు చూస్తూ.

"అబ్బ నీ యాష్ట చూసి అనవసరంగా నువ్వెందుకు బాధపడ్తావని అట్లా అన్నాను–"

"సినిమాలు చూసేది నా అటువంటి వాళ్ళే గద! అందుకే నేను యాష్టపడుతున్నాను. ఈ సినిమా వాళ్ళు బుజ్జిబుజ్జి, బుల్లిబుల్లి పిల్లలు ప్రేమలో పడ్డట్టుగా చూపించడం నేను భరించలేకుండా వున్నానే. ఏ విధంగా ఆలోచించినా నాకు ఈ కథలు మింగుడు పడడం లేదు" అంది లలిత గంభీరంగా.

"సరే! ప్రసిద్ధమైన దేవదాసు కథ ఆ విధంగా చిన్ననాటి ప్రేమతోనే మొదలైందే. సినిమావాళ్ళకు ప్రేరణ అక్కడ్నుంచే వచ్చిందేమోనే లల్లీ!" అన్నాన్నేను.

"అవును నిజమే! సుశీ! నువ్వన్నట్లు దేవదాసు కథలో... అంతెందుకు లైలా మజ్నూ కథలో ఇంతింత వున్నప్పట్నుంచే వాళ్ళు ప్రేమలో పడ్డారు. హా! అయితే ఇది మన సినిమావాళ్ళ సృష్టి కాదన్నమాట. సరేగాని! ఇంతింత చిన్న వయస్సులో మొదలైన ప్రేమ ఇక స్కూళ్లకు, జూనియర్ కాలేజీలకు చేరుకుంటున్నది. అంతంత పిల్లలు జీవితమంటే ఏమిటో తెలియని పిల్లలు ప్రేమలో పడి పాటలు పాడుతుంటారు. తమ చదువు, కెరీర్ అన్నీ మరచిపోయి ప్రేమలో పడ్డట్లుగా చూపించి టీనేజ్ పిల్లల్ని వెర్రివాళ్ళుగా చేస్తున్నారని ఒప్పుకుంటావా? లేదా? సుశీ చెప్పు?" అడిగింది లలిత.

"నువ్వనేదంతా నిజమే! ఇంత సంఖ్యలో ఇటువంటి సినిమాలను జనం మీదికి వదిలి జనాన్ని ముఖ్యంగా టీనేజి పిల్లల్ని వెర్రెత్తేటట్లు చేస్తున్నారు. అందులో ఏం అబద్ధం లేదు! ఇటువంటి వెర్రిమొర్రి కథలను మనం ఖండించాలి! మనం నోరు మూసుకొని కూర్చుంటే బాగుండదు" అన్నాన్నేను లలితను సమర్థిస్తూ.

"హమ్మయ్య! ఆఖరికి నువ్వు ఒప్పుకున్నావు" అంది లలిత.

"ఒప్పుకోవడమే కాదు ఇటువంటి ప్రేమ కథలను ప్రేక్షకులుగా మనం నిరాదరించి మన నిరసనను తెల్పాలి. అప్పుడుగాని సినిమావాళ్ళు తమ రూటు మార్చరు. మాటలు నేర్వని వేలెడంత పిల్లల మధ్య ఆకర్షణలో, ప్రేమలో చూపించడమేమిటే అసహజంగా!" నేను నా అసంతృప్తిని చూపాక గాని లలిత శాంతించలేదు. ●

ఒంటరిని రాలుస్తూ

నిర్ణీత సమయానికి
బడిగంట మోగినట్టు
మనసు గడియారం ముళ్ళై
నీ చుట్టూ ఊహల రెక్కలతో పరుగెత్తేది
నీ ఫోనుకేక రాల్చిన కలల్ని పేర్చుకుంటూ
మనం క్షణాల్ని ఉరితీస్తూ
వేలాడే గిజిగాడి గూటికి గువ్వలమై చేరాం
రేపటి కలలపై ఎగిరే ఆశల్ని
గాలిపటాలుగా వొదులుతూ
ఈ ఆఖరి రోజు మళ్ళీ రాదనీ
నలిగిపోతున్న క్షణాల్లో
ఒక్కగుండెగా కుమిలిపోయాం
తడిమి చూసిన అనుభవాలు సాక్షిగా
తొలిపొద్దు
మలి సంధ్య
మన ఒళ్ళంతా ఆకాశం చేసి



పక్షుల తాకిడితో
ఒక చిరుజల్లులా
ఒక హరివిల్లులా
పులకింతలు చేసేవి
మన [illegible] ల్లా ఊగుతుంటే
ఇంతలోనే కరచాలనాన్ని తడిపిన

నీ రెప్పల మేఘాలు
అలా నాపై వాలి
తడిచేశాయి
ఎంత చెప్పినా వినకుండా
ఎంతదూరం చేద్దామన్నా కదలకుండా
రెప్పల చప్పుడు లేకుండానే
కన్నీళ్లు వరదలై
దుఃఖ సుడిగుండంలో మునిగిపోయాం.
రెండే పట్టాల వెంట
నా కళ్ళ ముందే
నన్ను ఒంటరి రాలుస్తూ..
గుప్‌గుప్ మంటూ...
పొగల కెరటాల్లో నీ మనసు నొదిలేస్తూ
అందని నీ కిటికీ చూపుల సాక్షిగా
భారంగా దూరంగా కదిలిపోయావ్
నరాలు చిట్లిపోతున్నాయ్
ఆశల గూళ్లు విరిగిపోతున్నాయ్
ఇక నీ స్పర్శ కూడా ఒక స్వప్నమే
కాలం పొరల మీద నన్ను వదిలిపోతూ
జ్ఞాపకాల రీళ్ళలో మనల్ని కలుసుకోమనడం
కన్నీటి చెరువులో
పన్నీటి స్నానం ఒక కలే కదా నేస్తం!"

- గవిడి శ్రీనివాస్

కరువు



సమాధుల పక్కన గుడిసెలు
గుడిసెల పక్కన బోరుబావి
బోరుపక్కన కల్లు దుకాణం
కల్లు దుకాణం పక్కన కరెంటు స్తంభం
స్తంభం పక్కన కూలిన గోడ
గోడ పక్కన కాలిబాట
బాట పక్కన బ్రహ్మజెముడు పొద
పొద పక్కన కంకర కుప్పలు
కంకర కుప్పల పక్కన బస్టాండు
బస్టాండులో తురాయి చెట్లు
చెట్ల కింద దిగాలుగా రాలిన పువ్వులు
పువ్వులు కమిలేలా తిరిగే గండుచీమలు
ముగ్గురు పిల్లలు గిల్లిదండా ఆడుకుంటున్నారు
పిల్లలను అలసిపోని ప్రేమతో చూస్తున్న తల్లి
తల్లి పక్కన మూటాముల్లెతో జీవితం
మూటాముల్లెకు కొంచెం దూరంగా
చుట్ట కాలుస్తూ కూర్చున్న తండ్రి
అక్కడ చలనం లేదు
హడావుడి లేదు
ఎండిపోయిన చెరువు
జబ్బుపడిన నేల
కరువుతో ఊరుఖాళీ అయ్యింది
పట్నం బస్సు కోసం
వాళ్ళు ఎదురు చూస్తున్నారు.

- ఆశారాజు

✻ వి.ఆర్.వాగోలు

పిల్లలపై దండన ప్రభావం

"వంశీ! చెప్పినట్లు వినకపోతే దెబ్బలు పడతాయి. నీ ఇష్టం" అంటూ హెచ్చరించింది. వాళ్ళ అమ్మ "హోమ్‌వర్క్ చేశావో లేదే. లేకపోతే నీ పని పడతా జాగ్రత్త" అన్నది హిమజా వాళ్ళ అమ్మ. "ఈ రోజు చెప్పిన పద్యం గనుక రేపు చదువుకు రాకపోయావో ఒళ్ళు హూనం చేస్తాను" అని హెచ్చరించారు క్లాసు మాస్టారు. "ఈ పని చేయకపోతే ఊరుకోను" అని అన్నాడు అజయ్ వాళ్ళ నాన్న.



పిల్లలు తాము చెప్పినట్లు వినాలని తమ మాట కాదనకూడదని పెద్దలు అనుకుంటుంటారు. ఒకవేళ బాలు తమ మాట వినకపోతే ఎలాగైనా తమ చెప్పుచేతల్లో ఉంచుకోవాలని ప్రయత్నిస్తుంటారు. వినకపోతే దండనలకు గురిచేస్తూ తమమాట వినేలా చేయాలని అనుకుంటారు. మాట వినని పిల్లల్లో కేవలం దండన ద్వారానే మార్పురాగలదని, మార్పు తీసుకురాగలమని భావిస్తుంటారు.

చిన్న వయస్సులో ఉన్న పిల్లలను ఎక్కువగా దండనకు గురి చేస్తుంటారు. దండన తర్వాత పిల్లలలో మార్పు వస్తే అది కేవలం దండనవల్లనే సాధ్యమైందని అనుకుంటారు. అయితే దండనకు భయపడి మాత్రమే అలా మార్పు చెందారని, ఆ మార్పు తాత్కాలికమేనని వారికి తెలియదు. దండన వల్ల ఆశించిన మార్పు రాకపోగా అది మరింత వ్యతిరేక ప్రభావం చూపుతుంది. చిన్నారులు పెద్దల మాట వినకపోవటానికి, చెడు పనులు చేయటానికి, చెడు అలవాట్లకు గురి కావడానికి చాలా కారణాలుంటాయి. వాటిలో మిత్రులు, పరిసరాల ప్రభావం ముఖ్యమైనవి. ఏకాంతంగా ఉన్నపుడు చేయడానికి సాహసించని పనులు మిత్రులతో ఉన్నపుడు చేయటానికి ముందుకు వస్తుంటారు. ఉత్సాహం చూపిస్తుంటారు. గుంపు ప్రభావం చిన్నారులపై తనదైన ప్రభావాన్ని కలిగి ఉంటుంది. అందరూ తనను గుర్తించాలని, తనను గొప్పవాడు అనుకోవాలని ఉవ్విళ్ళూరుతుంటారు. దీనికితోడు ఆ బాలల గుంపులో ఉండే ఆకతాయి పిల్లల చేష్టలు కూడా చిన్నారులను ఆకర్షించి వారు కూడా ఆ పనులు చేసేందుకు పురికొల్పుతాయి. ఇతర బాలలను చూసి కూడా కొన్ని అలవాట్లను అలవరచుకుంటారు. వీటిలో కూడా మంచిపనుల కన్నా చెడు పనుల వైపే పిల్లలు ఆకర్షితులయ్యే అవకాశం ఉంది.

అప్పటివరకు తమ చెప్పు చేతల్లో వున్న తమ చిన్నారులు తమ మాట వినకపోవడం, చెడు అలవాట్లకు క్రమంగా దగ్గరకావటం సహజంగానే పెద్దవారిని కలవరపెడుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో ఎలాగైనా సరే పిల్లలను సరైన మార్గంలో పెట్టాలని, తమ మాట వింటూ తమ మాటకు గౌరవం ఇవ్వాలని భావిస్తారు. ముందు మాటల ద్వారా చెప్పి చూస్తారు. వినకపోతే దండనకు దిగుతారు. దాని వల్ల బాలలు మారినట్లే కనిపించినా అది తాత్కాలికమేనన్న విషయం మరువకూడదు.

కొందరు బాలలు తోటివారి వల్ల తమకు కలిగిన ఇబ్బందులను పెద్ద వారికి చెప్పి ఊరట పొందాలని ఆశిస్తారు. అలా ఎంతో ఆసక్తితో వచ్చిన చిన్నారులు చెప్పేది కనీసం వినిపించుకోకుండా వారిని కసురుకోవడమో రెండు అంటించడమో చేస్తారు. దీనివల్ల బాలల్లో విషయం చెబుదామని వెళితే విననైనా వినకుండా తమనే తిరిగి దండించారని భావించి మరలా రెండోసారి వారి దగ్గరకు వెళ్ళకుండా సమస్యను తావే పరిష్కరించుకొనేందుకు ప్రయత్నిస్తారు. అంటే ఎవరితోనైనా గొడవపడిన బాలుడు తాను కూడా అదే రీతిలో సమాధానం చెప్పాలని అనుకుంటాడు. తిట్టిన వారిని తిట్టడం, కొట్టిన వారిని మరలా కొట్టటం, ఇతరులపై తిరగబడడం వంటి పనులు చేస్తారు.

దురలవాట్లకు లోనైన పిల్లలను ఓ కంట నిశితంగా కనిపెడుతూ ఉండాలి. తొలుత అలవాటుకు లోనైన కారణం అన్వేషించాలి. అందుకు ఎవరి బాధ్యత ఎంత ఉందో విశ్లేషించాలి. తొలుత దురలవాట్ల వలన (ఉదా : సిగరెట్లు తాగడం, బడిమానివేయడం, అబద్ధాలు చెప్పడం, ఇతరులతో తగాదాలు పెట్టుకోవడం) కలిగే అనర్థాలను కథల రూపంలో చక్కగా వారికి వివరించాలి. పొరపాటు ఎక్కడ జరుగుతుందో తెలుసుకోవాలి. దీనికి దండన పరిష్కారం కాదు. దండనల వల్ల మార్పు వస్తుందనుకోవడం కన్నా ఇతర పద్ధతుల ద్వారా వారిని ఆ మార్గం నుండి మరలించేందుకు ప్రయత్నించాలి. దండన వల్ల ప్రతికూల ఫలితాలు వచ్చే అవకాశం కూడా ఉంది. దండనకు గురిచేసిన వారిపై బాలలు కక్ష పెంచుకోవడం, చాటుమాటుగా ఆ అలవాట్లను కొనసాగించటం, అకారణంగా తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే అపోహ పడడం, తమకు తెలియకుండానే దురలవాట్లకు మరింత దగ్గర కావడం చేస్తుంటారు.

అలా అని అసలు పిల్లలను దండించకూడదు అంటే దండించాలి. మొదటగా వారు చేసిన పని తప్పు కాదని వారు భావిస్తారు. తమకు ఆనందం కలిగించే ఏ పనినైనా వారు చేసేందుకు ఉత్సాహం చూపిస్తుంటారు. అవి తమకు, ఇతరులకు ఇబ్బంది కలిగిస్తాయనే విషయం వారికి తెలియదు. దండన అనేది పిల్లల ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చే సాధనంగా ఉండాలి కాని ప్రతికూల ఫలితాలనిచ్చే గుదిబండ కాకూడదు. దండన వారిలో మానసిక పరివర్తన తీసుకువచ్చి మరలా రెండవసారి అవే పనులు పునరావృతం కాకుండా ఉండేలా చేయాలి. పరివర్తన కోసమే దండన కాని శిక్షించడం కోసమే దండన ఉండకూడదు.

అన్నిటికంటే ముఖ్యంగా బాలబాలికలు దురలవాట్లకు దూరంగా ఉండేందుకు, వారిలో పరివర్తన కలిగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. వారు పిల్లలకు మార్గదర్శకంగా ఉండాలి. మంచి ప్రవర్తన వల్ల కలిగే లాభాలను, ఉపయోగాలను కథలు, గేయాల ద్వారా వినిపించాలి. మార్పు అనేది కేవలం ఒక్కరోజులో వచ్చేది కాదు. పిల్లలు చెప్పేది ముందు జాగ్రత్తగా, ఓపికగా వినాలి. అనంతరం వారు చెప్పే విషయాలలో నిజమెంతో గ్రహించాలి. తద్వారా పెద్దలంటే వారికి నమ్మకం కలుగుతుంది. తమ బాధలు, కష్టాలు వినే పెద్దలున్నారని భరోసా వారికి కలిగి నపుడు సాధ్యమైనంత వరకు దురలవాట్లకు బానిసలయ్యే అవకాశం లేదు. తాము చెప్పే విషయాలను పెద్దలు శ్రద్ధగా ఆలకించక అలక్ష్యం చేసినపుడు వీరు పక్కదారి పట్టే అవకాశం ఉంటుంది. బాలబాలికలు ఏమి చేస్తున్నారో గమనిస్తూ ఒకవేళ దురలవాట్లకు బానిసలవుతున్నారని భావించినపుడు వారికి విషయం వివరించి ఏది మంచో, ఏది చెడో గ్రహించేలా చేయాలి. దండన బాలబాలికల్లో మానసిక పరివర్తన తెచ్చేదిగా ఉండాలి. ఒకవేళ దండన పొందితే తాము పొందిన దండన తమకు సరైనదనే భావన వారిలో కలగాలి. కలిగించేందుకు ప్రయత్నించాలి. చిన్నారుల్లో మార్పు కలిగించేందుకు దండన చివరి అస్త్రంగా మాత్రమే ఉండాలి. కాని ప్రతి చిన్న విషయానికీ పిల్లలను దండించడం మానుకోవాలి. ●

* పి.ఎం.సుందరరావు

రాజు ఎంపిక

మగధ రాజ్యాన్ని చంద్రదత్తుడు అనే రాజు పరిపాలించేవాడు. ప్రజలను కన్నబిడ్డలవలె చూసుకునేవాడు. ఇరుగుపొరుగు రాజ్యాల్లోకూడా ఆయనకు మంచి పేరు వుంది.

చంద్రదత్తుడికి ముగ్గురు కుమారులు. వారే వీరదత్తుడు, మణిదత్తుడు, చారుదత్తుడు. ముగ్గురూ యుక్త వయస్కులయ్యారు. అన్ని విద్యల్లో ఆరితేరారు.

కొంతకాలం తర్వాత చంద్రదత్తుడికి ఆరోగ్యం క్షీణించింది. ఆ కారణంగా పరిపాలనా విషయాలపై ఎక్కువ శ్రద్ధ చూపలేకపోయాడు. ఇది గమనించిన ఆస్థానమంత్రులు 'మహారాజా! మీ కుమారుల్లో ఒకరికి రాజ్యభారాన్ని అప్పగించి, మీరు విశ్రాంతి తీసుకోండి' అని చెప్పారు. చంద్రదత్తుడికి ఆ సలహా నచ్చి, అలాగే చేయాలనుకున్నాడు.

అయితే సంప్రదాయం ప్రకారం పెద్ద కుమారుడిని రాజు చేయాలి. అలా కాకుండా తన ముగ్గురు కుమారులలో పరిపాలనపట్ల శ్రద్ధ వున్న ఒకరికి రాజ్యభారాన్ని అప్పగించాలని చంద్రదత్తుడు అనుకున్నాడు. వారిలో సమర్థుడు ఎవరో నిర్ణయించడానికి ఒక ఉపాయం ఆలోచించాడు. వెంటనే ముగ్గురినీ పిలిచి 'కుమారులారా! మీలో ఒకరికి రాజ్యభారాన్ని అప్పగించి, నేను పదవి నుండి వైదొలగాలనుకుంటున్నాను. మీరే రాజైతే రాజ్యాన్ని ఎలా పరిపాలిస్తారు? అసలు రాజు కావాలని ఎందుకు అనుకుంటున్నారు? ఓ పత్రంపై రాసి సాయంత్రంలోగా నాకు ఇవ్వండి' అన్నాడు. ముగ్గురూ సరేనన్నారు.

తమ అభిప్రాయాన్ని పత్రాలపై రాసి ఆ రోజు సాయంత్రం చంద్రదత్తుడికి ఇచ్చారు. ఆయన వాటిని అందుకొని ముందుగా వీరదత్తుడి పత్రం తీశాడు. అందులో "తండ్రిగారూ! నేను మీ పెద్దకుమారుడిని. ఆనవాయితీ ప్రకారం పట్టాభిషేకం నాకే జరగాలి. ఆ సంప్రదాయాన్ని అనుసరించి నేను రాజును అవుతాను. నాకు పరిపాలనాసంబంధ విషయాలు తెలియకపోయినా, ఆస్థాన మంత్రులందరూ సహకరిస్తారు. కాబట్టి అదే జరిగిపోతుంది" అని వుంది.

తర్వాత మణిదత్తుడి పత్రం తీశాడు. అందులో "రాజు కావటానికి ఎంతో అదృష్టం చేసుకొని వుండాలి. ఎందుకంటే రాజుకి సేవలు చేయటానికి ఎంతోమంది సేవకులుంటారు. విందులు, వినోదాలతో కాలక్షేపం అవుతుంది. రాజ్యంలో ఏ ప్రాంతానికి వెళ్లినా అక్కడి అధికారులు సన్మానం చేస్తారు. పొగడ్తలతో ముంచెత్తుతారు. ప్రజలు నీరాజనాలు పడతారు. కాబట్టి నన్ను రాజును చేస్తే, నా జన్మ ధన్యమైందని భావిస్తాను" అని రాసి వుంది.

చివరిగా చారుదత్తుడి పత్రం తీశాడు. అందులో 'తండ్రిగారూ! మీరు నా మీద నమ్మకంవుంచి రాజ్యభారాన్ని అప్పగిస్తే కచ్చితంగా స్వీకరిస్తాను. ఇప్పటివరకు మీరు చాలా సమర్థవంతంగా పాలించారు. ప్రజా సంక్షేమం కోసం కృషిచేశారు. అందుకు కొన్ని సుఖభోగాలనుకూడా వదులుకున్నారు. మీరు ప్రజల అభివృద్ధికోసం ఎన్ని పాట్లు పడ్డారో నాకు తెలుసు. నేను కూడా అదేవిధంగా పాటుపడతాను. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, క్షేమంగా వుండేలా పరిపాలిస్తాను. లేనిరోజున నేనే నా అసమర్థతను ఒప్పుకొని స్వచ్ఛందంగా పదవి నుండి తొలగిపోతాను' అని రాసి వుంది.

చంద్రదత్తుడు ముగ్గురి అభిప్రాయాలను ఆకళింపు చేసుకున్నాడు. తర్వాత వారిని పిలిపించి 'కుమారులారా! రాజు అనేవాడు సుఖభోగాలకు అతీతంగా వుండాలి. ప్రజలకోసం ఎన్నో కష్టాలను భరించాలి. కొన్ని త్యాగాలు కూడా చేయాలి. అప్పుడే మంచి రాజుగా కీర్తింపబడతాడు. ఈ రాజ్యానికి నా తర్వాత రాజు అయ్యే లక్షణాలు చారుదత్తుడిలోనే వున్నాయి. కాబట్టి రాజు అతడే' అని రాజ్యభారాన్ని చారుదత్తుడికి అప్పగించాడు. అతను తన నైపుణ్యంతో జనరంజకంగా పరిపాలించాడు. ●



క్విజ్-74

1. ప్రపంచంలో ఎత్తయిన ముదుత పర్వతములు?
   ఎ.హిమాలయ బి. ఆరావళి
2. 'షానామా' రచయిత ఎవరు?
   ఎ.కల్హణుడు బి. పిరదౌసి
3. కర్నాటక రాజధాని?
   ఎ. బెంగుళూరు బి. డిస్పూర్
4. ఇగ్లూలలో నివసించేవారు?
   ఎ.ఎస్కిమోలు బి. బుష్‌మెన్
5. కాశ్మీరు దీనికి ప్రసిద్ధి?
   ఎ. చందనపుబొమ్మ బి. ఉన్నితివాచీ
6. ఎక్సరేను కనుగొన్నది?
   ఎ.రాంట్‌జన్ బి.ఎడిసన్
7. భూమి నుంచి మిక్కిలి దూరంగా వున్న గ్రహము?
   ఎ.శుక్రుడు బి.శని
8. పిల్లలకు వుండే దంతాలు?
   ఎ.శాశ్వత దంతాలు
   బి.పాల దంతాలు
9. అక్రమాకార వస్తువు ఘనపరిమాణమును దేనిని ఉపయోగించి కనుగొనవచ్చు?
   ఎ. కొలజాడి
   బి. పిప్పెట్
10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?
    ఎ. జుగ్‌రాజ్ సింగ్
    బి. గగన్ అజిత్ సింగ్

చిన్నారి చిత్రకారులు

బి.ఉదయ్ ప్రకాష్,
7వ తరగతి,
ప్రగతి బాల విద్యాలయం ,
సుందరయ్యనగర్,
తాడేపల్లి.

మక్కెన హరీష్‌కుమార్,
10వతరగతి, శ్రీవిశ్వశాంతి
పబ్లిక్‌స్కూల్, చినకాకాని.



కె.మాధవి,
8వ తరగతి,
జడ్‌పిహెచ్‌ఎస్,
షాబాద్, రంగారెడ్డి.



డి.నవీన్‌కుమార్, 4వ తరగతి,
ఆంధ్రా పబ్లిక్ స్కూల్, హరిపాలెం,
విశాఖ.

భలే కారు!



చింటూ కారు భలే వుందికదూ. మరేంటనుకున్నారు! అందులో రకరకాల వస్తువులు వున్నాయి. మీరు అవేంటో కనుక్కోవాలి. మీకు ఒక చిన్న క్లూ ఇద్దామనుకుంటున్నా. అదేంటంటే... ఆ కారులో మీరు ఉపయోగించే వస్తువులే ఎక్కువగా వున్నాయి. అదీ సంగతి. మరి గబగబా చెప్పేసెయ్యండి.

తాడు తెంపగలరా!

హాయ్!



ఇవాళ మీకు చెప్పబోయే మేజిక్ భలే తమాషాగా వుంటుంది. పైగా దీన్ని మీ నిత్య జీవితంలో కూడా ఉపయోగించవచ్చు. అయితే ముందుగా నా ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. మీరు గట్టితాడును ఈజీగా తెంపగలరా? తెంపలేరా! అయ్యయ్యో. మీకు పెద్దవాళ్లెవరూ చెప్పలేదా? అయితే ఇవాళ నేర్చుకుందాం. సరేనా. మీ ఎడమచేతి చూపుడు వేలు చుట్టూ తాటికొసను చుట్టండి. తర్వాత బొమ్మలో చూపించినట్టుగా దాన్ని మీ చేతి చుట్టూ చుట్టండి. అప్పుడు మీ కుడిచేతితో తాటిని అరమీటరు మేరకు కిందికి తీసుకుపోయి దాన్ని నాలుగైదుసార్లు కుడిచేతిచుట్టూ చుట్టండి. ఇప్పుడు రెండు పిడికిళ్లు బిగించి వాటిని దగ్గరగా చేర్చండి. కుడి పిడికిలిని రకీమని పైకి లాగండి. అప్పుడు మీ ఎడమ పిడికిట్లోని తాడు 'ఎ' అనే బిందువు వద్ద తెగుతుంది.దీనికి కారణం ఏంటంటే... మొత్తం బలమంతా 'ఎ' అనే బిందువు వద్ద కేంద్రీకరించబడడమే. అందువల్లే తాడు అక్కడ తెగుతుంది. ఇకనుంచి మీరు పురికొసను చాలా సులభంగా తెంపొచ్చుకదూ.

మేజిక్! మేజిక్!!

క్విజ్ 73 జవాబులు

1. ప్రమాదము 2. కాళిదాసు 3. హవానా 4. కేరళ 5. మైకేలాంజెలో 6. 6 7. అశోకుడు 8. అమీబా 9. వెన్నెముక 10. కస్తూరి రంగన్

క్విజ్ 72కు సరైన సమాధానాలు రాసిన వారు :

ఎన్.సారథిశర్మ, 9వ తరగతి, **ఎన్.సువర్ణకుమారి**, 8వ తరగతి, విద్యానగర్, పొన్నూరు. **ఎల్.విశాలి**, 5వ తరగతి, **టి.హరిప్రసాదరావు**, 10వ తరగతి, **జె.కాశీనాథ్**, 6వ తరగతి, కోడూరు, గుంటూరు.**కె.పవన్‌కుమార్**, 10వ తరగతి, మల్లాపాలెం, ప్రకాశం. **టి.భావనకుమారి**, 6వ తరగతి, చిన్నమండలవీధి, శ్రీకాకుళం. **కుర్రా శారద, కుర్రా లక్ష్మి** గవరపాలెం, విశాఖ. **డి. విశ్వనాథ్**, 9వ తరగతి, దువ్వలి, ప్రకాశం. **కె.కరుణాకర్**, 9వ తరగతి, త్రిపురాంతకం, ప్రకాశం.

కలం స్నేహం

పేరు: సిద్దురి కారుణ్య,
వయసు : 13 సం॥
చదువు : 9వ తరగతి
హాబీలు : క్రికెటర్ల ఫొటోలు సేకరించడం, ప్రజాశక్తి పేపరు చదవడం.
పూర్తి చిరునామా : సిద్దురి కారుణ్య, డాటరాఫ్ సంపత్‌రావు, హుజూరాబాద్, ఇంటినెంబరు: **20 - 226 / 1**, కరీంనగర్.



పేరు: మహ్మద్ ఫయాజ్ అలీ,
వయసు : 14 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : ప్రజాశక్తి పేపరు, దీపిక చదవడం, వాలీబాల్ ఆడడం, టీవీ చూడడం.
పూర్తి చిరునామా : మహ్మద్ ఫయాజ్ అలీ, సన్నాఫ్ మహబూబ్‌అలీ, చింతల్‌ఘట్, కొహిర్ మండలం, మెదక్.

నాలుగు లక్షల రూపాయలు - మసీదు

ఓసారి అక్బరుపాదుషావారి దగ్గరకు ఒక కేసు వచ్చింది. అదేంటంటే... పట్టణంలోని ఒక ధనవంతుడు మరణించాడు. అతను చనిపోవడానికి ముందు పెద్ద మసీదు వున్న భూమిలో నాలుగు లక్షల రూపాయలు పాతిపెట్టాడు. డబ్బు అవసరమై అతని కుమారుడు వాటిని తీసుకోవాలనుకున్నాడు. అందుకని మసీదు కూల్చడానికి పాదుషా అనుమతి అడిగాడు.

'మసీదు కింద డబ్బు దాచిపెట్టటమేంటా?' అని సభలోని వారంతా ఆశ్చర్యపోయారు. పాదుషావారు ఈ కేసును పరిష్కరించే బాధ్యత బీర్బల్‌కు అప్పగించారు. ఎంత ఆలోచించినా బీర్బల్‌కు ఏమీ అర్థంకాలేదు. చివరికి ఆ ధనవంతుని ఇంటికి వెళ్లి... 'బాబూ! ఆ డబ్బు విషయమై మీ నాన్నగారు ఏదైనా పత్రం రాశారా? వుంటే చూపిస్తావా?' అని అడిగాడు. అతను ఇచ్చిన పత్రంలో 'రెండు మినారులు కలిసేచోట తవ్వినచో డబ్బు లభించును' అని వుంది. మసీదుకు నాలుగు మినారులు వుంటాయి. వాటిలో రెండు మినారులు కలిసేచోటు ఏమిటా? అని ఆలోచించాడు బీర్బల్. మరునాడు మధ్యాహ్న సమయంలో మసీదు దగ్గరకెళ్లి చూశాడు. ఆ శిఖరాల నీడలు ఎక్కడ కలిశాయో గుర్తుపెట్టుకున్నాడు. ఆ తర్వాతిరోజు మధ్యాహ్నం ధనవంతుని కుమారుడిని, భార్యను, పాదుషావారిని, దర్బారులోని ఉద్యోగులను తీసుకుని మసీదు దగ్గరకు వెళ్లాడు బీర్బల్. అక్బరు అనుమతితో మసీదుయొక్క రెండు మినారులు కలిసేచోట తవ్వించాడు. అక్కడ నాలుగు లక్షల రూపాయలు కనిపించాయి. అప్పుడు అక్బర్‌తోసహా అందరూ బీర్బల్ తెలివితేటలను మెచ్చుకున్నారు.

సముద్ర గుర్రం



గుర్రంలా కనిపించే ఈ జీవి నిజానికి చేప. ఇవి ఉష్ణసముద్రాలలో జీవిస్తాయి. ఇవి 15 నుండి 30 సెంటీమీటర్ల వరకు మాత్రమే పెరుగుతాయి. వీటిలోనే 15 సెంటీమీటర్లకన్నా తక్కువ సైజుండే చేపలు కూడా వున్నాయి. వీటి తల గుర్రం ఆకారంలోనూ, తోక పొడవుగానూ వుంటుంది. ఇవి తోకల సాయంతో పైకీ కిందకీ కదులుతాయి. మరో విచిత్రం ఏమిటంటే ఇందులో మగ చేపకు ప్రత్యేకంగా సంచి వుంటుంది. ఆడ చేప ఈ సంచిలోకి వెళ్లి గుడ్లు పెడుతుంది. నెలరోజుల తర్వాత ఆ గుడ్లు పొదగబడి పిల్లలుగా మారి సంచి నుండి బయటకు వస్తాయి.



ఇంటింటికీ కోటి వరాలు

రుక్మిణి

"ఏవమ్మా... అందరూ బాగున్నారా? ఏంటీ-మీ ఆయనేడీ? ఏంచేస్తున్నాడేం? అరరె... బుజ్జమ్మ ఎంతలావున ఎదిగిపోయిందీ.. ఏం చదువుతున్నావమ్మా?" రంగబాబు ఆ ఇంట్లోకి హడావుడిగా పంచెబిగదీసి వూడిపడి ప్రశ్నించడంతో పని చేసుకుంటున్న రంగమ్మ బిత్తరపోయింది. అప్పటికే రంగబాబు నేలమీద పారాడుతున్న 'బుజ్జోడ్ని' లేవదీసి వడినింపుకుని, వాడితోబాటే కేరింతలు కొడుతూ కుక్కిమంచంలో సెటిలయిపోయి వున్నారు గదా! రంగమ్మకు అంతుబట్టలేదు. పొద్దున్నే వచ్చి పిల్లల చదువుల గురించీ, తన పెనిమిటి గురించి వివరాలడిగే ఈ మొనగాడెవరబ్బా అని కాస్తంత పస్తాయించింది.

"ఏం లేదు వదినమ్మా.. అన్నట్లు గోదావరి పుష్కరాల్లో మునిగారా... పుణ్యం... దానికి మన చంద్రబాబుగారే ప్రపంచంలో మరే గోదావరికీ చేయనన్ని ఏర్పాట్లు చేసి పారేశారు - అరరె... గ్యాసుబండ.. అంటే తమరు మన డ్వాక్రా గుంపేనన్నమాట! జ్జొజ్జొ... జ్జొ.... బుజ్జీ చాక్లెటు తింటావా? అది సరేగాని వదినమ్మా.. అన్నగారేరీ... అన్నట్టు మీకు రేషను కార్డు లేదు గాబోలు.. వుందా.. లేదా... లేకుంటే చెవినెయ్యండి...

రంగబాబు గంట వాయించినట్లు గణగణా మోగిపోతున్న వాడల్లా - ఒక్కసారే ఆగిపోయి... కుక్కి మంచం మీద నుండి దూకి కుప్పిగంతులకు తగులుకున్నాడు. తనివితీరా పొదివి పట్టుకుని ఒడినెత్తుకున్న చంటాడు ఏకధాటిగా రంగబాబు పంచెలాల్చీ సాంతం తడిపిపారేశాడు..!

"ఛ... ఛ.. వూర్కోకన్నా... ఎవరిమీదనైనా వదలాల్సిందేనాయె... అదే ఆరిపోతుంది.. ఏంటమ్మా వీడు ఈసురోమని ఈడగిలబడి పోతున్నాడు. మంచి పౌష్టికాహారం అందించాలె! ఆ రోజులు కూడా వస్తున్నాయిలే - మరో ఏడేండ్లలో 2010 నాటికి స్వర్ణాంధ్ర నీ ఇంటి ముందుకు వచ్చి చదికిలబడి పోతుంది - ఏదికావాలంటే అదీ - చిటికెలో నీ ఒళ్ళో వాలిపోతుంది! ఏదీ.. మరో సంవత్సరం లోపు ఈ మాయదారి ఎన్నికలు వచ్చిపడుతుండె - ఎన్నికల కన్నా ముందు మనం తేల్చుకోవాల్సింది మనకు 'స్వర్ణాంధ్ర' కావాలా? వద్దా అని! ఒకవేళ మనంగానీ వద్దనుకుంటే పొరుగురాష్ట్రం వాళ్ళు గద్దలా తన్నుకుపోతారు..."

ఈ దెబ్బకు రంగమ్మ ఈయనగారికి కచ్చితంగా పిచ్చివంటిది లేచివుండవచ్చు... ఒకవేళ అదిగాని కాకపోతే.. ఇదో కొత్తరకం 'అడుక్కోడం' గానీ కావచ్చునేమో... మరి మనిషిని చూస్తే పిటపిటలాడి పోతున్నాడు... ఇస్త్రీ బట్టలు... ఏమో... రోజులిట్లా తగలబడ్డాయి. ఎవడు దొంగో... ఎవడు దొరో.. ఎవడు బిచ్చగాడో... ఎవడు ధర్మదాతో ఎరిగి పట్టుకోడం కష్టంగా వుంది.. ఏంచేసేది? చేతిలో కాణీ కూడా లేదాయె... బియ్యంగాని పడతాడో..

"అయ్యా బాబుగారూ... వేద్దామంటే చేతిలో పదిపైసల బిళ్ళకూడా లేదు - పొద్దున్నే ఇంటిగడపలో నువ్వు... పిడికెడు బియ్యం వేద్దామంటే పట్టడానికి సంచీవుందా?"

రంగబాబులో నీరసం పాతాళంలోకి దిగబడిపోయింది - మనసంతా అల్లకల్లోలమై విపరీతంగా కృంగిపోయాడు - "అబ్బే.. నేనేం అడుక్కుతినే వాడనుకున్నావా? అబ్బే నేను బూత్ కమిటీ ఛైర్మన్ని... ఛ... ఛ... స్వర్ణాంధ్ర సాధించడానికి కంకణం అదీ కట్టుకున్నాను... ఛ.. ఛ. అడుక్కుతినేవాడ్ని అన్నావుగదా... సరే వదినమ్మా.. నీ మాటెందుకు కాదనాల.. నేను దేబిరించి అడుక్కునే వాడ్నే... ఏదో... అదీ... అదేంటంటే...

రంగమ్మకు కాస్త భయం వేసి కాస్తంత సవరదీసుకుని పమిట నిండుగా కప్పుకుంది - రంగబాబు గమనించే స్థితిలో లేడు. కండ్లు మూసుకుని తన్మయంగా వాయించేస్తున్నాడు. "అదీ... నిన్ను అడుక్కోవడానికే వచ్చింది. అయితే దాన్తోబాటే కొన్ని వరాలు కూడా నీకు ప్రసాదించితేగానీ నా పని పూర్తవదు... అద్సరే... కాస్తంత కాస్తంత కాఫీ అయినా ఇవ్వచ్చుగదా... గ్యాస్ స్టవ్ వెలిగించి... తెలుగు ఆడపడుచులు కన్నీరు కార్చకుండా కాఫీ తయారు చేస్కోడానికి చంద్రబాబుగారు ప్రసాదించిన వరం...

"ఏడ్చినట్లుంది... మూడొందలకు గ్యాసు కొనుక్కోవాలె... యాడ్నుంచి తీస్కరావాలె?" రంగమ్మ తుపాకి గుండులా పేల్చడంతో రంగబాబు ఓ మూలుగు మూలిగాడు.

"సరె.. మరి రేషను కార్డు... అయ్యో... ఎవడూ పట్టిచ్చుకోలేదా? ఏందటా... అర్థంటు..." రంగబాబు హడావుడి పడ్డాడు.

"ఏడ్చినట్లుంది... మా ఆయన మార్కెట్లో దడవాయి ఉద్యోగం అనీ... ఆదాయం సంవత్సరానికి పన్నెండువేలు దాటిందనీ నాతెల్లకారటు పీక్కుపోయిరి! అదున్నపుడు అయిదు రూపాయలకు బియ్యం ధర పెంచిరి! కిరసనాయిలు పదిరూపాయలాయె... ఇది పనికాదనుకుని కరంటు బుడ్డి వెలిగిస్తే - దాని మీటరు చార్జీలు కట్టకపోతే వైరు వూడబీక్కపోయిరి - రంగమ్మ ఎడాపెడా మూడు నాలుగు బాంబులు పేల్చడంతో రంగబాబు మరీ నీరసపడి అయిదారు మూలుగులు మూలిగాడు - ఎటూ పాలుపోక ఒంటి చెమట తుడుచుకుని 'ఉస్సు'రని నిట్టూర్చాడు - పోనీ... ఈ పిలకాయనెత్తుకుని కాసేపు ఆటాడిస్తే... అమ్మో... ఒకటికి బదులు రెండయితే డేంజరు... ఈవిడ అన్నీ శాపనార్థాలకే తగులుకున్నదాయె! పిల్లకు సైకిలు వరం ఇస్తామని ఆశచూపితే - కొంత శాంతించవచ్చు... ఈలోపున ఆ పిల్లదాన్ని కాస్త వుబ్బేసి పబ్బం గడుపుకోవచ్చు.

"చూడమ్మా... నువ్వేం చదువుతున్నావోగానీ... రోజూ నువు నడిచి బడికి వెళ్ళడం నాకు చాలా బాధగా వుంది.. ఓ సైకిలు కొనిమ్మని మీ నాన్నను అడగలేకపోయావా..."

రంగమ్మ ఒక్కసారే పమిట నోట్లో కుక్కుకుని వెక్కిళ్ళకు తగులుతుంది - రంగబాబుకు అడుగుజారినట్లయింది - "ఇదెక్కడి పీకులాటరా దేవుడా... ఎవరూలేరు.. ఎవరన్నా చూసినా బావుండదు... ఏం కష్టం వచ్చిందో.. కనుక్కోడం ఎట్లా?" అంతలోనే బిలబిలమని పసుపు చీరలు సింగారించుకుని 'తెలుగుమహిళాగుంపు' వచ్చి పడడంతో రంగబాబు వూపిరి పీల్చుకున్నాడు.

"అక్కా... వదినా... అమ్మాయ్... అంతా కులాసాయేగదా.. మనింట్లో ఓట్లెన్ని... ఓట్ల పండగ దగ్గర పడుతుందిగదా... మన చెంద్రబాబుగారే స్వర్ణాంధ్ర తెచ్చిపెడుతున్నారు - మీరు తప్పకుండా వెయ్యాలె... ఏదీబావగారు... అన్నగారు.. అబ్బాయేడీ... "చిందర వందరగా కంగాళీగా అడుగుతూ రంగమ్మ నుదుట కుంకుమబొట్టు పెట్టబోవడంతో రంగమ్మ ప్రళయంగా ఛీత్కరించింది.

"నా మొగుడు పోయి వారం తిరగలే... బంగారమంటి పెనిమిట్ని గా దొంగ చీప్‌లిక్కర్ పొట్టన పెట్టుకునె... యాడ జూసిన... గల్లిగల్లిన ఇంటింటికీ బెల్టు బ్రాండీ దుకాణాలు పెట్టి నా మొగుడ్ని సంపినారు గద దేవుడో... వాట్ని మూయించండని దెబ్బలాడక వాయినాల వాయింపుకు మీకు వేళయిందా తండ్రీ... ఈ సర్కారు నాశనం కాను.. బంగారమంటి నా పెనిమిటి పోయినంక ఈ స్వర్ణాంధ్ర నాకు ఒరగబెట్టేదేంది నాయనో... ఇట్ల ఎన్ని కొంపలు కూల్చుతారు... తండ్రో... బొట్లు పెట్టి ఓట్లు అడగడానికి సిగ్గెట్ల లేదురదేవుడో..

ఒక్కసారిగా పెద్ద కలకలంతో రంగబాబుతో సహా మహిళా మణులందరూ సీన్లో నుండి హఠాత్తుగా అదృశ్యమైపోయారు... ఓంశాంతి!! ●

దోపిడి..

శ్రమ ఒకరిది. ఫలితం మరొకరిదనే పాయింటు కేవలం సినీమా కతకే పరిమితమని అనుకోకూడదు! నిజజీవితంలో కూడా అనేక సందర్భాలలో జరుగుతున్న తంతు ఈ విధంగానే వుంటుంది. నిజానికి – పచ్చి జీవితాన్ని కాపీ కొట్టి సినీమాలు తీస్తారు. నేలమీద జరుగుతున్న అనేకానేక గొడవల్ని తీసుకుని వాటికి కొంచెం అతిశయోక్తి అంటించి – వెండితెరమీద కెక్కిస్తారు. ఆ సినీమాలు చూచి జనం వెర్రెక్కిపోతారు. వాళ్ళ బతుకుల్ని కూడా సినీమా చేసుకోవాలని ముచ్చట పడతారు. అదృష్టం బావుంటే – ఆ సినీమాలో వున్న మంచి పాయింట్ల సాయంతో మెదడ్ని ఆరోగ్యంగా వుంచుకుంటారు. గీత బావుండకపోతే ఆ సినీమాలో చూచిన చెడును వంటబట్టించుకుని చెడిపోతారు. ఇది మంచి, ఇది చెడు అని చెప్పడం వరకే సినీమా డ్యూటీ! మంచీ చెడూ చెబుతాయి సినీమాలు! మంచినొదిలేసి చెడును పట్టుకుంటే చెడిపోతాం! ఈ పాయింటును గాలికొదిలేసి – సినీమాలను నిషేధించమనడం తగదు. ఎవరైనా మనకి అద్భుత వార్తలు వినిపిస్తున్నప్పుడు – సినీమా కతలు చెప్పొద్దని విసుక్కుంటాం! సినీమా కతలు అభూత కల్పనలని మన ప్రగాఢ విశ్వాసం!

అంతే తప్పు – సినీమాల ద్వారా నిర్మాతలు మనకి అందజేస్తున్న జీవిత సత్యాలను ఏ మాత్రం పట్టించుకోం. ఎంత తప్పు? సినీమా కత పట్ల ఎవరైనా చులకన భావంతో మాటాడుతున్నప్పుడు నా మనస్సు చివుక్కుమంటుంది. ఆ కథలు మనలో వున్న మంచి చెడుల్ని చెప్పే ప్రయత్నం చేస్తాయి. ఏది మంచి, ఏది కాదనే నీతి వాక్యాన్ని మనకు అందిస్తాయి. కనీసం – ఇందుకైనా మనం సినీమాలను గౌరవించాలి! మచ్చుకు ఒక సినీమా కథ మనవి చేస్తాను. డబ్బుతో బాగా బలిసిపోయిన మనిషతను. లోక కళ్యాణం కోసం నిత్యం పూజలూ, వ్రతాలూ జరిపిస్తూ తరిస్తున్న మనిషతను. పరమగంగిగోవు. చీమకు సైతం అపకారం చేయకూడదనే నీతికి కట్టుబడి వున్న మనిషి. ఇల్లాంటి మనిషిని ఆ ఊరి వాళ్ళంతా వర్తమాన దేవుడని కీర్తిస్తుంటారు! అతని రహస్య జీవితం మాత్రం దీనికి విరుద్ధంగా సాగుతూ వుంటుంది! దేవుడనుకునే ఈ మనిషి కొన్ని దుర్మార్గాలు గుట్టుగా సాగిస్తుంటాడు!

భర్త అనబడే ఆసామి తన జీతమెంతో ఇంటో చెప్పనే చెప్పడు. తనకొచ్చే జీతంలో సగం తన సొంత ఖర్చుకి కేటాయించుకుని – ఇంటికి సగం జీతమే తెస్తాడు. దాంతోనే నెలంతా సర్దుకోమని ఇల్లాలిని హెచ్చరిస్తాడు. సంసారం గడవాలంటే నెలకి ఆరేడు వేలు కావాలి. అలాంటిది రెండు మూడు వేలిచ్చి సర్దుకోమంటే ఏమిటర్థం? కోట్ల విలువ చేసే వజ్రాలు నా చేతిలో పెట్టు – నీ చేతికి మాత్రం వంద రూపాయల విస్కీయిస్తాననే థియరీ కూడా ఇదేగా? వజ్రాలు సంపాయించి పెట్టడానికి ఆ దొంగలు ప్రాణాలకు ఎంత కష్టపడతారో – ఆ స్థాయిలో సంసార భారం మోసేందుకు ఇంటి ఇల్లాలు కూడా అంతే అవస్థపడాలి! లభించిన వజ్రాలు ఇనప్పెట్టెలో దాచుకుని ముష్టి విస్కీ సీసాలు విసిరేయడం సినీమా కతలో పెద్దమనిషికి ఎంత సుళువో – సంసారం కతలో సదరు భర్తక్కూడా అంతే సుళువు. ఇంటో ముష్టి మూడు వేలిచ్చి సొంతానికి నాలుగైదు వేలు వాడుకోడం శ్రీవారికి సుఖంగానే వుంటుంది. ఆ మూడు వేలతోనే నెలంతా గడపడానికి ఆ ఇల్లాలు ఎంత ఇబ్బంది పడుతుందో పట్టించుకోడు! కష్టాల లిస్టు అతని చెవిని వేసినా పట్టించుకోడు. జలగలా పీడిస్తున్నావని కోప్పడతాడు. ఇచ్చింది పుచ్చుకుని ఇబ్బంది పెట్టకుండా బండిని నడిపించమని ఆజ్ఞలు జారీ చేస్తాడు. అప్పుడే ఉత్తమ ఇల్లాలివనే పేరొస్తుందని ఆశ పెడతాడు!

పేరు కోసం కాకపోయినా సంసారం అల్లరి కాకూడదనే సదుద్దేశంతో ఎంతో గుట్టుగా... నేర్పుగా... జాగ్రత్తగా నెలంతా గడుపుతుందామె! ఇంటి అవసరాలతో పాటు పిల్లల అవసరాలనీ ఆదుకుంటుంది. ఇంటో అల్లరికీ, అశాంతికీ చోటులేకుండా చూసుకుంటుంది. ఇవన్నీ సక్రమంగా జరిగిన్నాడే అన్నంతినే హక్కు నీకుంటుందని అతను ఆర్డరు వేయకుండానే అర్థం చేసుకునే స్థాయికి ఆమెను తయారు చేస్తాడు. నెల గడుస్తుంది. మూడు వేలకే ఏ సమస్యా లేకుండా సౌఖ్యంగా నెల గడిచింది గనక – వచ్చే నెల్లో ఇంకెంత తగ్గించి జీతం ఇంటో ఇవ్వాలో లెక్క లేసుకుంటాడు సదరు భర్త! మరో పక్క బహుమంచి గుణవంతుడు, ఇంటికోసం ప్రాణాలు ధారపోసే పెద్దమనిషనే బ్రాండు కీర్తి కిరీటం బయట ప్రపంచం నుంచి సంపాయించుకుంటాడు. అంతేగాని – ఆ నెలలో ఆ పుణ్యవతి ఎన్ని పస్తులుందో... పుట్టింటి నుంచి ఎంతెంత డబ్బు తెప్పించుకుందో ఆ మానవుడు పట్టించుకోడు. కనీసం తెలుసుకుందామనే ప్రయత్నం కూడా చేయడు! ఇది మగమారాజు సైకాలజీ! ●

✻ యాసలపు సూర్యారావు



అందాల అంతర్వేది

నిత్యం ప్రకృతి అందాలతో అలరారు ప్రదేశం తూర్పు గోదావరి జిల్లాలోని కోనసీమ. ఎక్కడ చూసినా కొబ్బరి తోటల అందాలతో గౌతమీ గోదావరి నిండుగా ప్రవహిస్తూ కనువిందు చేసే ఆ ప్రదేశంలో ప్రఖ్యాతి గాంచిన పుణ్యక్షేత్రం అంతర్వేది నరసింహస్వామి దేవాలయం. ఇది రాష్ట్రంలోని పేరెన్నిక గల దేవాలయంగా ప్రసిద్ధి గాంచింది. ఇది తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లి మండలంలోని అంతర్వేది గ్రామంలో వుంది. ఇక్కడ మరో విశిష్టత వుంది. వశిష్టగోదావరి సాగరగర్భంలో కలుస్తుంది. సముద్రం, గోదావరి రెండూ సంగమించే అద్భుత దృశ్యం చూసి తీరాల్సిందే



అంతర్వేది పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురానికి 10 కి.మీ. దూరంలోనూ, తూర్పు గోదావరి జిల్లా రాజోలుకు 24 కి.మీ. దూరంలోనూ వుంది. పురాతన చరిత్ర కలిగిన ఈ దేవాలయాన్ని దర్శించుకోవటానికి ఆంధ్రరాష్ట్ర నలుమూలల నుండి పర్యాటకులు నిత్యాం వస్తూనే వుంటారు. ఇక్కడ ప్రతినిత్యం పూజలు, అభిషేకాలు జరుగుతూనే వుంటాయి. ఇక్కడ బ్రహ్మదేవుడు కృతయుగంలో మహారుద్రయాగం చేసి ఈశ్వర అనుగ్రహం పొందినట్లు స్థల పురాణాన్ని బట్టి తెలుస్తోంది. ఆ యజ్ఞశాలలోని అంతర్వేదిలో నీలకంఠేశ్వర స్వామిని ప్రతిష్టించి యజ్ఞం పూర్తి చేశాడు. అనంతరం వశిష్టుడు గోదావరి నుండి ఒక పాయను తెచ్చి సముద్రంలో కలిపినట్టు ఒక గాథ ఉంది. ఆ సాగర సంగమం ప్రాంతాన అందమైన కుటీరాన్ని నిర్మించుకొని తపస్సు నాచరించాడు. గోదావరి పాయకు సముద్రానికి మధ్య ఉన్న స్థలభాగాన్ని అంతర్వేదిగా పిలుచుకుంటారు.

కలియుగానికి ముందుగానే వశిష్టుడు అంతర్వేదిని వదిలివెళ్ళిన కారణంగా ఆలయంలోని దేవునికి ఏ రకమైన పూజా పునస్కారాలు లేక గుడి శిధిలమయ్యిందని చెబుతుంటారు. అంతేకాక కేశవదాసు అనే మాధవుడు నరసింహస్వామిపై పెరిగిన పుట్టలను భక్తి శ్రద్ధలతో తొలగించి, స్వామి విగ్రహాన్ని బయటకు తీసి ప్రత్యేకించి కర్రలతో చిన్న ఆలయాన్ని నిర్మించి అందులో స్వామిని ప్రతిష్టించి పూజా కార్యక్రమాలు చేపట్టాడు. అందుకే అక్కడ ఒక ఊరికి కేశవదాసుపాలెం అనే నామకరణంతో నేటికీ పిలుస్తున్నారు. ఇంత ప్రఖ్యాతి గాంచిన ఈ ప్రాంతమంతా కూడా తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురం సంస్థానాధీపులు శ్రీవత్సవాయి జగపతి మహారాజు ఏలుబడిలో వుండేది. ఇక్కడ స్వామి కళ్యాణ మహోత్సవానికి, ఇతర పర్వదినాలలో స్వామికి జగపతి వంశీయులు ఆభరణాలు, వివిధ రకాలైన ఎన్నో విలువైన కానుకలు సమర్పించే వారు. శిధిలమైన ఈ ఆలయాన్ని బెండముడిలంక వాస్తవ్యులు కొప్పనాతి ఆదినారాయణ అనే భక్తుడు తిరిగి ఆలయాన్ని అందంగా పునర్నిర్మించారు. ఆయన కుమారులు కృష్ణమ్మ, రంగనాయకుల సహకారంతో ఆలయాన్ని క్రి.శ. 1822లో నిర్మించారు. తదనంతర కాలంలో బ్రిటీష్ వారు వచ్చాక ఆలయ ధర్మకర్తృత్వాన్ని మొగల్తూరు రాజులకు అప్పగించారు. మొగల్తూరు రాజు రంగరాజు ఆలయాన్ని మరింత శోభాయమానంగా తీర్చిదిద్ది అనేక విధాల ఆలయ ప్రతిష్టను పెంచి భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. ఆ తర్వాత ఆ బాధ్యతలను ఆయన వంశానికే చెందిన రాజా కలిదిండి రామచంద్రరాజు కూడా ఆలయాన్ని అనేక విధాల అభివృద్ధి చేశారు. నాటి నుండి నేటి వరకు ధర్మకర్తలుగా మొగల్తూరు రాజవంశీయులే కొనసాగుతున్నారు.

ఆలయానికి ఎదురుగా రాతితో కట్టిన మండపం వుంది. అలాగే ఆలయానికి ఎడమవైపుగా మరో మండపాన్ని నిర్మించారు. ఆలయం చుట్టూ ప్రకృతి అందాలు విరజిమ్ముతూ అందమైన పచ్చటి కొబ్బరితోటలతో నిండి వుంటుంది. అందర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవాలు ప్రతీఏటా మాఘశుద్ధ సప్తమి రోజున ప్రారంభమవుతాయి. మొత్తం తొమ్మిదిరోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. అత్యంత భక్తిశ్రద్ధలతో లక్షలాది మంది భక్తులు రాష్ట్రం నలుమూలల నుండి వస్తారు. మొదటి రోజు స్వామి వారిని, అమ్మవారిని పెళ్లికొడుకును, పెళ్ళికూతుర్ని చేయడం నుండి శ్రీవారి వేడుకలు ప్రారంభమవుతాయి. దశమి నాటి రాత్రికే స్వామి కళ్యాణ మహోత్సవం అత్యంత శోభాయమానంగా జరుపుతారు. ఆ మరుసటి రోజు భీష్మ ఏకాదశి రోజున నరసింహస్వామి వారి తోబుట్టువు శ్రీలక్ష్మిరూడాంబిక గుర్రాలక్క గుడి వరకూ ఊరేగింపుగా వెళ్ళి అక్కడ పూజలు నిర్వహిస్తారు. ఆఖరి రోజున అనేక సాంస్కృతిక కార్యక్రమాలను కన్నుల పండుగగా జరుపుతారు. ఈ అంతర్వేది నరసింహస్వామి క్షేత్రాన్ని దక్షిణ కాశిగా పిలుస్తారు. ఇంత ప్రతిష్ట కలిగిన ఈ క్షేత్రాన్ని, అందమైన సముద్రం, గౌతమీ నది సంగమించే దృశ్యాన్ని కనులారా చూసితీరవలసిందే మరి. ●

✻ వనగంటి నవీన్ కుమార్



1.13 కోట్లను ప్రజల కోసం వినియోగిస్తే.....

- మారుమూల గ్రామాల్లో సురక్షిత మంచినీటి సౌకర్యం కల్పించవచ్చు.
- వీధి లైట్ల కింద చదివే విద్యార్థులకు ఆహారం, విద్యుత్ సౌకర్యం కల్పించవచ్చు.
- దేశంలోని ప్రతి నగర, పట్టణ ప్రభుత్వాసుపత్రులలో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులనెదుర్కొంటున్న ఎయిడ్స్ బాధితులైన వితంతు మహిళలు, పిల్లల కోసం వీటితో వైద్య సహాయాన్ని అందించవచ్చు.
- దేశంలో మారుమూల ప్రాంతాలు ప్రత్యేకించి ఈశాన్య ప్రాంతాల్లో నిధుల కొరత ఎదుర్కొంటున్న అథ్లెట్లకు నాణ్యమైన కోచింగ్ సౌకర్యాలు కల్పించవచ్చు.
- దారిద్ర్య రేఖకు దిగువనున్న వారిని ఈ డబ్బులతో కొంత మేరకైనా ఆదుకోవచ్చు.

సచిన్‌పై అంత ప్రేమెందుకు?

గతంలో భారత దేశంలో రెండింటిని ప్రతి పౌరుడు గుర్తించేవాడు. ఒకటి ఆగ్రాలోని తాజ్‌మహల్. మరొకటి అంబాసిడర్ కారు. వీటిని తలదన్నే విధంగా ప్రతి ఒక్కరూ గుర్తు పట్టే ప్రముఖునిగా సచిన్ టెండుల్కర్ ఎదిగాడు. భూమండలంలో అత్యంత ధనవంతుడైన క్రికెటర్‌గా గుర్తింపు పొందాడు. ఫియట్ కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేసినందుకు ఆ సంస్థ 75 లక్షల విలువైన ఫెరారీ కారును సచిన్‌కు ఇటీవల బహూకరించింది. వాస్తవంగా కార్లను విదేశాలనుండి దిగుమతి చేసుకోవాలంటే 120 శాతం కస్టమ్స్ డ్యూటీ చెల్లించాలి. అంటే 1.13 కోట్ల రూపాయలను సచిన్ చెల్లించాలి. డ్యూటీని మినహాయించాలని ప్రభుత్వాన్ని సచిన్ కోరాడు. వెంటనే స్పందించిన ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని మినహాయించింది. దీంతో వివాదం రగులుకున్నది.

సచిన్‌కు కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు ఇవ్వడం అవసరమా;? వందల కోట్ల రూపాయల ఆస్తికి అధిపతి అయిన సచిన్‌కు కోటి రూపాయలు తక్కువయ్యాయా? తన దయనీయ స్థితిని తెలిపి రెండు లక్షలు సహాయం చేయండని అడిగిన భారత రత్న బిస్మిల్లా ఖాన్‌కు తడబడుతూ, జాప్యంచేసి సహాయం చేసిన ప్రభుత్వం సచిన్ అడిగిన వెంటనే కోటి రూపాయలకు మించి కస్టం డ్యూటీ మినహాయింపు ఇవ్వడం సమంజసమేనా? అంతే కాక డ్యూటీ చట్టాన్ని మార్చడానికి కూడా ప్రభుత్వం సిద్ధపడింది. ఈ విధంగా చేయడం శ్రేయస్కరమా? 200 మంది విద్యార్థుల విద్యాభ్యాసానికి ఖర్చు భరిస్తున్నానని సచిన్ చెప్పాడు. ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం మంచిదే. కాని సచిన్‌కు అందిస్తున్న ప్రోత్సాహకాలను, అతను ఆర్జిస్తున్న లాభాలను దృష్టిలో పెట్టుకుంటే అతను చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు గొప్పవేమీ కావు. ప్రభుత్వం అనాలోచితంగా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల సచిన్ లాభ పడతాడా? ఇతను సాధించిన విజయాలు రూ. 1.13 కోట్ల కన్నా ఎక్కువా? వెల కట్టలేని ఈ విజయాలు భారత క్రికెట్‌కే కాకుండా క్రీడారంగానికి ఎంతగానో తోడ్పడ్డాయి. దేశంలో సురక్షితమైన మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యంలేక జీవనం సాగిస్తున్న వారికి మేలుచేయకుండా ఒక వ్యక్తి కోసం డ్యూటీ మినహాయించే హక్కు ప్రభుత్వానికుందా? చట్టాలకు అందరూ సమానులేనని అభివృద్ధి చెందిన దేశాలు వెల్లడిస్తున్నాయి. దీనికి ఉదాహరణ పన్నుల ఉల్లంఘనకు పాల్పడినందుకు జర్మనీలో ప్రముఖులుగా గుర్తింపు పొందిన టెన్నిస్ క్రీడాకారులు బోరిస్ బెకర్, స్టెఫీగ్రాఫ్‌లను సైతం వదలలేదు. దేశ వ్యాప్తంగా బెకర్‌కు ఉన్న ప్రతిష్టను దృష్టిలో పెట్టుకుని ఒక కేసులో అతన్ని జైలుకు పంపకుండా జడ్జి భారీ ఫైన్ విధించారు. అలాగే ఆదాయపు పన్ను చెల్లించడంలో అవినీతికి పాల్పడిన స్టెఫీగ్రాఫ్ తండ్రికి జైలు శిక్ష విధించారు. కాని భారత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు పూర్తి భిన్నంగా ఉన్నాయి. పన్ను మినహాయింపు ఇవ్వడం ప్రభుత్వ విధాన నిర్ణయమని సొలిసిటర్ జనరల్ కెకె సూద్ అంటున్నారు. దీన్ని అనవసరంగా పెద్దదిగా చేస్తున్నారన్నారు. క్రికెట్ వల్ల భారత దేశ ఖ్యాతి అంతర్జాతీయంగా ఇనుమడించిందని, అందువల్ల క్రికెటర్లను నిరుత్సాహ పరచవద్దని విజ్ఞప్తి చేశారు. కస్టమ్స్ డ్యూటీ మినహాయింపులో కేంద్ర మంత్రి ప్రమోద్ మహాజన్ కీలక పాత్ర పోషించారు. అంతేకాక ఆర్థిక మంత్రిత్వ శాఖపై ఒత్తిడి తెచ్చారని ఆరోపణలొచ్చాయి. ఒక క్రికెటర్‌కు కేంద్ర మంత్రి సహకరించడంలో ఆంతర్యమేమిటి? కెకె సూద్ చెప్పినట్లు నిరుత్సాహమనే పదాన్ని విశ్లేషిస్తే, దారిద్ర్య రేఖకు దిగువనున్న 25 కోట్ల మంది ప్రజలను ప్రభుత్వం ఏవిధంగా ఉత్సాహపరుస్తున్నది? క్రికెట్ విషయంలో ఉదారంగా వ్యవహరిస్తూ అమితంగా ఖర్చు చేయడం, ఇతర క్రీడలకు వచ్చే సరికి ఖర్చుకు వెనకాడడం ప్రభుత్వ ద్వంద్వనీతిని వెల్లడిస్తున్నది. అర్జున అవార్డుల సంఖ్యను పెంచడానికి, ప్రత్యేక పరిస్థితుల్లో ఖేల్‌రత్న అవార్డులను ఇద్దరికి ఇవ్వడానికి నిధులు లేవని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రతిభ చూపించిన వారికిచ్చే ఈ అవార్డులకు అయ్యే ఖర్చు 20 లక్షలకు మించి ఉండదు. కానీ ఒక వ్యక్తి కోసం రూ. 1.13 కోట్ల కస్టమ్స్ డ్యూటీ మినహాయించడం భావ్యమేనా? ఒక వైపు క్రీడాకారులను పట్టించుకోకుండా మరోవైపు క్రీడోత్సవాలను భారీగా నిర్వహించడానికి నిధులను ఇబ్బడి ముబ్బడిగా ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది. దీని వల్ల క్రీడారంగానికి దీర్ఘకాలిక ప్రయోజనముందా? ఆఫ్రో-ఆసియన్ క్రీడలను నిర్వహించడానికి ప్రభుత్వం 100 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోంది. ఈ క్రీడల్లో ఎంత మంది మన క్రీడాకారులు పాల్గొంటారు? దీనిని ఉపయోగించుకుని అంతర్జాతీయ క్రీడల్లో ఎంత మంది పాల్గొనే అవకాశముంది? ఎంత మంది క్రీడాభిమానులు టికెట్ కొని ఈ క్రీడలను తిలకిస్తారు. 1.13 కోట్లు భరించే వారికి కస్టమ్స్ డ్యూటీని మినహాయించింది. ఇంకా ఇటువంటి వాళ్ళెందరున్నారో బయట పడాల్సిన అవసరముంది. దీని గురించి విస్తృతంగా చర్చించకుంటే ఈ విషయం మరుగున పడే అవకాశముంది. ●

ఎవరేమంటున్నారు

● **కపిల్ :** ఒక వ్యక్తి కోసం విధానాలను మార్చకూడదు. ఒక వేళ మారిస్తే అందరికీ వర్తింప చేయాలి. ప్రతి ఒక్కరికి వర్తించే వ్యవస్థ మన దగ్గర ఎందుకు లేదు? విశ్వనాథన్ ఆనంద్, ధన్ రాజ్ పిల్లై, సౌరవ్ గంగూలి, అమితాబ్ బచ్చన్ విమానాన్ని బహుమతిగా పొందితే వీరికి పన్ను వర్తింపచేస్తారా? లేదా?

● **సయ్యద్ కిర్మానీ :** క్రీడారంగానికే కాకుండా అందరికీ ఒకే విధంగా ప్రాధాన్యత ఇవ్వాలి. క్రీడాకారులందరికీ అవకాశాలు ఒకే విధంగా ఉంటాయి.

✻ మార్ల మనోహర్

అమృత హృదయం

"అయ్యా! ముసలోళ్ళ పించను ఎప్పుడిత్తారయ్యా?" అంటూ వాచ్‌మెన్ ఎల్లప్పను దీనంగా అడుగుతోంది ఓ ముసలవ్వ.

ఆ ముసలవ్వ మాటల్ని హేళన చేస్తూ "ఆ.. ఇత్తారిత్తార్లే ముసల్దానా! రేపు పున్నానికి రాపో. ఇత్తారం"టూ హేళనగా జవాబిచ్చాడు ఎల్లప్ప.

అక్కడికి వచ్చే ముసలోళ్ళతో హేళనగా మాట్లాడటం ఎల్లప్పకో సరదా. అలా అడిగిన ప్రతిసారీ హేళనగా జవాబిచ్చిన ఎల్లప్ప మాటలకు మనసు నొచ్చుకున్న ఆ ముసలవ్వ "ఆ... ఏందప్పా! జామారికి అవలాయి మాటలు మాట్లాడ్తావ్. ఏం నేనంటే నీకంత అవలాయా? ఇత్తే ఇత్తారనులేకుంటే లేదు. అంతేకాని పొద్దాకల అమాసకు రా. పున్నానికి రా అంటూ జాంతాన మాడ్తావ్. ఏం ముసలోళ్ళంటే నీకంత అవలాయా?" అంటూ కాస్త మనసునొచ్చుకొని కటువుగానే మాట్లాడిందా ముసలవ్వ!

ఆ మాటకు రయ్...న లేచిన ఎల్లప్ప "అద్గో. అదే అదే... మీ ముసలోళ్ళతో వచ్చిన పీకులాట. ఇద్గో.. ముసల్దానా! ఆ పించన్ల... గించన్ల సంగతి నాకు తెల్దుగాని అద్గో. ఆడ కూకున్నడే. ఆసార్‌ని అడుగుపో.. నీకంతా చెప్తాడు. పో.. పో.." అంటూ గట్టిగా గదమాయించి రుసరుసలాడ్తూ విసవిస బయటికి నడిచాడు ఎల్లప్ప.

అక్కడ జరుగుతున్న తతంగమంతా నా ఛాంబర్లో కూర్చొని కిటికీ గుండా గమనిస్తూనే ఉన్నాను. అందులో నేను పి.యస్.గా బదిలీ అయి వచ్చిన మూడు నెలల నుంచి ఆ అవ్వ దినచర్యను గమనిస్తూనే ఉన్నాను. ఆమె జీవితం ఏంటో నాకు బొత్తిగా అర్థం కాలేదు. ఆమె వింత ప్రవర్తన చూచి మొదట నేను ఆమెను పిచ్చిదనుకున్నాను. కాని ఆమె మాట తీరు చూసి ఆమె పిచ్చిది కాదని గ్రహించుకున్నాను. ఎప్పుడూ భిక్షగత్తెవలె చంకకు జోలే తగిలించుకొని తిరుగుతూ ప్లాస్టిక్ కవర్లో ఏవో తినుబండారాలు పట్టుకొని ఆ చెట్టు కింద కాసేపు, ఈ చెట్టు కింద కాసేపు కూర్చొని తింటూ అక్కడే వున్న కొళాయి నీళ్ళు తాగి సాయంత్రం దాకా అక్కడే గడిపి సాయంత్రం కాగానే ఎక్కడికి పోతుందో ఏమో తెలియదు. మరలా మరుసటి రోజు ప్రొద్దునే ఆఫీసులో ప్రత్యక్షమై అక్కడికి వచ్చి పోయే వాళ్ళందరితో అయ్యా! ముసలోళ్ళ పించను ఎప్పడిత్తారు? అమాస ఎప్పడొత్తాది? పున్నమెప్పుడొత్తాది? అని అమాయకంగా అడుగుతుంటుంది. ఆమె జీవన స్థితి నాకేమీ అర్థం కాక నేను ఎన్నో సార్లు ఆమెను పిలిచి ఆగడాలనుకునే వాణ్ణి ఆమె జీవితం గూర్చి తెలుసుకోవాలనే ఉద్దేశంతో. కాని ఎప్పుడూ తీరిక చిక్కేది కాదు.

ఈ రోజు తీరిక దొరికింది. ఈ రోజైనా ఆమె జీవితం గూర్చి పూర్తిగా అడగాలనుకొని 'అవ్వా! ఇట్లారా' అని ఆప్యాయంగా పిలిచాను. నా పిలుపుకు సంతోషపడిన ఆ అవ్వ ఊతకర్ర పట్టుకొని నిదానంగా నడుస్తూ నా ముందుకొచ్చి నిలబడి రెండు చేతులు జోడించి 'అయ్యా! ముసలోళ్ళ పించనెప్పుడిత్తారయ్యా! ఇంటికాడ పిల్లోళ్ళను చూడబుద్ధి అయితాంది. పిల్లోళ్ళను చూడకమూడు నెలలైంది. పించనిస్తే ఊరికిపోయి పిల్లోళ్ళను చూసొత్తా' అంటూ ఏడుపు మొహంతో దీనంగా అడిగిందామె. అలా దీనంగా అడుగుతున్న ఆమెను చూడగానే హృదయం ద్రవించి 'అవ్వా! ఇట్లారా' అని ఆప్యాయంగా దగ్గరకి పిల్చి పక్కనే ఉన్న చెక్కబల్లపై కూర్చోబెట్టి ఉన్న విషయం చెప్పాను.

'అవ్వా! మీ పించన్ శాంక్షన్ అయింది. సోమవారమొచ్చి తీస్కపో' అనగానే 'సోమవారమంటే యా సోమవారం అయ్యా? రేపొచ్చే సోమవారమా? లేక మళ్ళా వచ్చే సోమవారమా?' అనుమానంగా అడిగిందా అవ్వ.

'రేపు సోమవారమే అవ్వా! ఈ రోజు శనివారం. రేపు ఆదివారం ఆఫీసుకు సెలవు. అందుకు మర్నాడు వచ్చి తీస్కపో' అంటూ ఉన్న విషయం చెప్పానామెకు.

"మూడు నెలలు పించను ఒకేసారి కలిపి ఇస్తారయ్యా?" అంటూ మరోసారి అనుమానంగా అడిగిందామె.

"ఆ... అవునవ్వా! అవును మూడు నెలల పించను కలిపి ఒకేసారి ఇస్తాం" అంటూ భరోసా ఇచ్చాన్నేను.

ఆ మాటకు కాస్త ఉపశమించిన ఆమె 'చల్లని మాట చెప్తివయ్యా! నూరేళ్ళు చల్లగా బతుకు'

అంటూ ఆనందంగా పలికింది.

'సరే అయ్యా! రేపు సోమవారమొచ్చి పించన్ తీస్కపోతా. పించన్ తీస్కొని అట్లే ఊరికిపోయి పిల్లోళ్ళను చూసొత్తా' అని ఎంతో ఆనందంగా పలికింది.

పిల్లలు.. పిల్లలని పదే... పదే ఆమె అంటుండే... అనుమానమొచ్చి అడిగా 'అవ్వా! ఎవరా పిల్లలు.'

"ఎవరంటే ఎవరయ్యా! నా పిల్లలే. నా మనవళ్ళు" తాపీగా జవాబిచ్చిందా అవ్వ

"నీ మనవళ్ళా, ఎక్కడున్నారు వాళ్ళు" రెట్టించిన అనుమానంతో మరోసారి అడిగాను. అయినా ఆమె గురించి పూర్తిగా తెలుసుకోవాలనే ఉద్దేశంతో మరింత ముందుకు వంగి అడిగాను. "అవ్వా! మీ దేవూరో నేనడిగిన మాట పూర్తి కాకుండానే... 'మాది వడగూరయ్యా!' అని టక్కున జవాబిచ్చిందామె.

అయితే 'నీకు కొడుకులెంతమంది?"

"నాకా... ఇద్దరు కొడుకులున్నారు".

"మరైతే నీకేంటీ ఈ ఖర్మ, లక్షణంగా వాళ్ళ దగ్గరే ఉండొచ్చుకదా, ఏం వాళ్ళు నీకింత అన్నం పెట్టలేరా?" అనుమానంగా అడిగాను.

"ఆయప్ప పెట్టాలనుకున్నా ఆయమ్మ పెట్టనీయదుకదయ్యా!"

' ఆయమ్మంటే ఎవరు ?' రెట్టించిన అనుమానంతో అడిగాను.

"ఎవరంటే ఎవరు. నా పెద్దకోడలు. ఆయమ్మకెప్పుడూ వాళ్ళ పుట్టింటోళ్ళ సుఖం తప్ప నా సుఖమెప్పుడూ పట్టదు. నా కొడుకు సంసారమంతా దోచి దోచి పుట్టింటోళ్ళకు పంపుతాది. వాడూ ఆయమ్మ చేతిలో కీలుబొమ్మ. పెళ్ళాం తానా అంటే తందానా అంటాడు. అవన్నీ తల్చుకుంటే ఒక్కొక్కసారి నిద్రకూడ రాదయ్యా! ఆ రోజు నేను వాళ్ళనంత కష్టపడి సాకితే ఈ రోజు వాడు వాని పెళ్ళాం మాట విని నాకింత కూడు పెట్టకుండా బయటికి నెట్టాడంటూ" వెక్కివెక్కి ఏడ్చిందామె.

"మరి నీ చిన్న కోడలు మాటేంటీ, ఆమె కూడా నీ పెద్ద కోడలి మాదిరి గయ్యాళా?"

" ఆఁ లేదు లేదు నాయనా! నా చిన్న కోడలు దేవత. శానమంచిది. నన్ను సొంతతల్లి కన్న ఎక్కువగా చూస్కొంటాది."

"మరి! నీ చిన్న కోడలి దగ్గరే ఉండకూడదా? ఆమె చాలా మంచిదంటున్నావుగా?"

"అవునయ్యా! ఉండాలని నాకు ఉంది. కాని ఆ నాకొడుకు, నన్నాడ ఉండనీయట్లేదు కదా! ఎప్పుడూ తాగొచ్చి నన్నూ నా కోడల్ని జత చేసి తంతాడు, వాని చేతిలో ఆ దెబ్బలు తినలేకేనయ్యా నేనిట్ల వచ్చేసింది. ఎల్లకాలం యాడ తింటానయ్యా ఆ దెబ్బల్ని? అప్పుడండే వయసు ఉండే. ఆ దెబ్బలకు తట్టుకుంటానికి. ఇప్పుడా వయసుయాడుందయ్యా! ఇంక వాని చేతిలో తన్నులు తినటం నాచేతకాదు. వాడేమన్న ఉత్త చేతులతో కొడతాడా! వాని చేతికి ఏమి దొరికితే దాంతో కొడతాడు, ఇద్గోనయ్యా! ఇవన్నీ వాడు కొట్టిన దెబ్బలే" చూడంటూ వీపుపైనున్న పాతగాయాల మచ్చల్ని చూపించిందా అవ్వ.

'ఆ గాయాల్ని చూడగానే అదేందవ్వా! అంత దుర్మార్గంగా కొట్టినాడే. వాడు మనిషా లేక రాక్షసుడా?' అని ఆగ్రహంగా అడిగాను.

నా మాటల్ని తేలిగ్గా తీస్కొని 'పోన్లేయ్యా! వాని పాపంతో వాడు పోతాడు' అని తేలిగ్గా జవాబిచ్చిందా అమృత హృదయంగల ఆ తల్లి.

'ఆ తిరుగుబోతు కొడుకేం పన్జేస్తాడక్కడ?'

ఆ మాటకు "రెండు చేతుల్ని వెల్లకిలా తిప్పుతూ ఏం పన్జేయడయ్యా! ఇంట్లో తినటం, ఊర్లో తిరగటం. పాపం ఆ పిల్ల కష్టం చేసి తెచ్చుకున్న దుడ్లుకూడ గుంజుకొని పోయి తిరగటం, అదేం అని అడిగితే ఆ పిల్లను గుద్ది గుద్ది చంపడం, పాపం ఆ పిల్ల వానితో ఎట్లా ఏగుతాందో ఏమో. దానికీ ఇద్దరు పిల్లలున్నారు. ఆ తాగుబోతు మొగుడితో ఏగుతూ, ఆ పిల్లల్ని ఎట్లా సాకుతాందో ఏమో!" అని కోడలిపై జాలిపడ్తూ వలవల ఏడ్చింది.

'అందుకే నేను దాచిపెట్టుకున్న పించను దుడ్లు కూడా వానికే ఇస్తా. లేకుంటే వాడు దాన్ని తన్ని నా దగ్గరికి పంపిస్తాడు. ఏందో నా కథ నాకే అర్థం కాదయ్యా! ఆడసూత్తే ఆయమ్మకు టోకు బియ్యం ఇత్తే ఒక్క పూట ఇంట్లోకి రానిత్తాది. ఈడ సూత్తే ఈడేమో, పించను దుడ్లు ఇత్తేనే ఇంట్లోకి రానిస్తాడు. చ... చ... ఏం బతుకయ్యా నాది. నా బతుకులో ఎప్పుడూ రవ్వంత కూడ సుఖం లేదు. మంచి వయసులో ఉన్నప్పుడు ఆ మొగుని చేతిలో తన్నులు తినేదాన్ని. ఇప్పుడీ వయసులో ఈ కొడుకుతో" అంటూ భగవంతుణ్ణి కసితీరా తిట్టుకుంటూ కన్నీళ్ళు

తుడుచుకుందామె.

'నీ ఒక్క దానివే ఇంత కష్టపడ్తాంటే నీ మొగుడు నీకేం సాయం చేయలేదా?'

'ఆ మొగుడు చేసిన పీకులాటే ఇదంతా. నానోట్లో మట్టికొట్టి నన్నూ, నా పిల్లల్నిడిచి ముప్పై ఏళ్ళయింది. అప్పట్నుంచి నేను మొగోనిగానే బతుకుతాండా..'

"అదేందవ్వ నీ మొగుడు నిన్నిడిచి ముప్పై ఏళ్ళయిందా? ఎందుకిడిచి పెట్టినాడు? ఎక్కడున్నాడిప్పుడు" ఆతృతతో ప్రశ్నల వర్షం కురిపించాను.

"ఆ చుట్టంరాళ్ళ మోజులో పడి, నా సంసారమంత దోచి దోచి చుట్టం రాలికి పెట్టి ఇంటిని దివాళా తీయించినాడు" అని చాలా కటువుగానే జవాబిచ్చిందా అవ్వ

'మరి అందర్నీ విడిచి ఎట్లా బతకాలనుకున్నావ్?'

'ఎట్లంటే... ఇట్లేనయ్యా! నా ఒంట్లో బలం పోయినా, ఓపిక పోలేదు. నా కట్టం... నేనే చేస్కొని బతుకుతాండా, పొద్దున్నే లేచి, ఆ తురుకోళ్ళ చెప్పులంగడి ముందర కసువు నూకితే ఆ బాషా ఓ రూపాయిత్తాడు. ఆ గొల్లోళ్ళ.. హోటల్లో గ్లాసులు కడిగితే, ఇంత ఉగ్గాని, ఓ బజ్జి ఇత్తారు అవి తిని కడుపు నింపుకుంటా. మళ్ళా సంద్యాలప్పుడు, ఆ కోంటోళ్ళంగడి ముందు కసువు నూకి నీళ్ళు చల్లితే వాళ్ళూ ఓ రూపాయిత్తారు. ఆ రూపాయి, ఈ రూపాయి రెండు రూపాయలు కలిపి ఆ కోంటిశెట్టి దగ్గరే రెండు రూపాయల దినచీటి కడతాండాను.'

'ఎందుకూ, ఆ డబ్బులు కూడ నీ కొడుకులకి ఇచ్చేదానికా?'

'ఆ... లే... లేదయ్యా! ఆ దుడ్లు పంచాయితీ బోర్డోళ్ళ కోసం దాచి పెడ్తాండాను.'

'ఏందీ! పంచాయితీ బోర్డోళ్ళ కోసమా. ఎందుకూ?' ఆశ్చర్యంగా అడిగాన్నేను.

'ఎందుకంటే నా కోసమేనయ్యా, రేపు నేను సచ్చిపోతే, ఎవరు పారేత్తారు నన్ను? అందుకే ఆ దుడ్లు తీస్కొనైనా ఆ పంచాయితీ బోర్డు వాళ్ళు నన్ను పారేత్తారు. అందుకే ఆ కోంటిశెట్టికి ముందే చెప్పినాను. అయ్యా! నేనెప్పుడైనా సచ్చిపోతే, నేను నీ దగ్గర దాచిపెట్టుకున్న దుడ్లను పంచాయితీ బోర్డు వాళ్లకిచ్చి నాపీనిగను ఎత్తేపించు అని చెప్పినాను. నేనింత వరకు ఎవ్వరి రుడం (ఋణం) తినలేదు. అందుకే సచ్చిపోయేటప్పుడుగాని, ఎవ్వరు రుడంలో ఉండకూడదనుకున్నాను. అందుకే నయ్యా ఆ దుడ్లు దాచిపెట్టినాను.'

అవ్వ అంటున్న ఒక్కొక్కమాట నా గుండెకు సూటిగా హత్తుకుంటున్నాయి. అవ్వ ఆవేదనను వినగానే నా కళ్ళు చెమ్మగిల్లాయి. నాకు తెలియకుండానే నా కళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయ్. ఔరా! అవ్వ జీవితం ఎంత దుర్భరం. పట్టించుకోని పిల్లల కోసం కష్టించి కడుపు మాడ్చుకొని, వాళ్లని పెంచి, పెద్దజేసి, అంతిమదశలో పిడికెడు మెతుకులకు, అయినవారి ఆప్యాయతకు నోచుకోక, ఎడారిలో కోయిలలా అంగలారుస్తూ, ఒంటరిజీవితం గడుపుతున్న ఆమె జీవిత గాథ వినగానే నా గుండె తరుక్కుపోయి, కళ్ళలోనీళ్ళు జలజల రాలాయి. దైన్యంగా అమాయకత్వంతో శూన్యంలోకి చూస్తూ కూర్చున్న ఆమెను చివరిగా మరో మాట అడగాలనుకొని అడిగేశాను.

అవ్వా! పగలంతా ఇక్కడే కాలం గడుపుతావ్, రాత్రిళ్ళు తలదాచుకోడానికి నీ కంటూ ఓ గుడెసుందా?

నా మాట పూర్తికాకుండానే "ఆ ... ఆ... ఉందయ్యా! ఉంది. ఆ కమినిట్టోళ్ళ (కమ్యూనిస్టోళ్ళ) పుణ్యాన నాకూ ఓ గుడెసుంది. ఆ కమినిటోళ్ళు.. ఈ ఊర్లో ఉన్న బీదాసాదా జనాలకి ఆ కొండ కింద గుడిసెలేపించి పుణ్యం కట్టుకున్నారు. మనసున్న మా రాజులు. నా పరిస్థితి చూచి, నాకూ ఓ గుడిసేపించి, టోర్లో బియ్యం కార్డు ఇప్పించి, ముసిలోళ్ళ పించను రాపిచ్చినారు. బీదాసాదా జనాలని ఆదుకున్న ఆల్లు నా ఆయుష్షు కూడా పోస్కొని నిండా నూరేళ్ళు బతకాలని రోజూ ఆ దేవున్ని మొక్కుకుంటానయ్యా" అని అంటుండగానే అబ్బా... అని గట్టిగా ఓ సారి మూలిగి ఒక్క ఉదుటున కాలును బలంగా విదిలించింది.

ఆ మూలుగుకు బిత్తరపోయిన నేను ఆత్రంగా 'ఏమైందవ్వా! ఏమైందని' కంగారుగా కుర్చీలో నుంచి లేచి అవ్వ చేయిపట్టుకొని అడిగాను.

వంచిన తలను మెల్లిగా పైకెత్తి... 'ఏం లేదయ్యా! పుండుమీద ఈగలు ముసిరికొరికినా'యంటూ బాధను దిగమింగుతూ అందా అవ్వ..

ఆ పుండుకంటుకున్న చీమును తుడుచుకుంటూ 'ఇది మొన్న ఇనుపకడ్డీ తగిలిందయ్యా' అని నిదానంగా చెప్పిందామె.

'ఇద్గో... ఈ ఇరవై రూపాయలు తీస్కొని ఆటోలో పోయి ఆసుపత్రిలో చూపించుకోపో' అంటూ జేబులో నుంచి ఇరవై రూపాయలు తీసి అవ్వ చేతిలో పెట్టి మెల్లిగా బయటికి నడిపించుకొచ్చాను.

'వత్తానయ్యా!' అంటూ నా దగ్గర సెలవు తీసుకొని ముందుకు నడిచింది. అలా మెల్లిగా ముందుకు సాగిపోతున్న అవ్వను చూస్తూ... దీర్ఘాలోచనలో పడ్డాను.

పుస్తక పరిచయం

సావర్కర్‌పై సమగ్ర పరిశీలన

చరిత్రను వక్రీకరించడం ఫాసిజం ప్రాథమిక లక్షణం. చరిత్ర హీనులను చారిత్రక పురుషులుగా చిత్రీకరించేందుకు ఫాసిస్టులు నిరంతరం ప్రయత్నిస్తుంటారు. గతంలో అటల్‌బిహారీ వాజ్‌పేయిని క్విట్ ఇండియా ఉద్యమంలో పోరాడిన యోధునిగా చిత్రీకరించేందుకు బి.జె.పి. ప్రయత్నించి భంగపడిన విషయం మనకు తెలుసు. ఇప్పుడు సంఘ్‌పరివార్ 'హిందూత్వ' సిద్ధాంత కర్త వినాయక దామోదర సావర్కర్‌ని జాతీయోద్యమ వీరునిగా చిత్రించేందుకు ప్రయత్నిస్తోంది. ప్రజలలో పట్టుకోల్పోతున్న ప్రతి సందర్భంలోనూ సంఘ్‌పరివార్ ఇటువంటి కుటిల ప్రయత్నాలు చేయడం దాని రాజకీయాలను కొంచెం జాగ్రత్తగా పరిశీలించే వారందరికీ తెలిసిన విషయమే. ఏదో కొన్ని విషయాలలో కొందరు గాంధీజీతో విభేదించినా ఆయనను 'మహాత్మా'గాంధీగా భారతీయులంతా స్మరించుకొంటారు. కానీ గాంధీజీ హత్యకు గాడ్సేని ప్రేరేపించిన క్రూర సావర్కర్‌ని 'వీర' సావర్కర్‌గా అంగీకరింప చేసేందుకు పరివార్ ప్రయత్నిస్తోంది. పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో సావర్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరించడం, పోర్ట్‌బ్లెయిర్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయానికి సావర్కర్ పేరు పెట్టడం ఈ ప్రయత్నంలో భాగాలే. ఈ ప్రయత్నాలే ప్రఖ్యాత పాత్రికేయుడు, న్యాయవాది ఎ.జి.నూరానీని సావర్కర్ జీవిత చరిత్రపై విస్తృతమైన పరిశోధనకు ప్రేరేపించాయి. ఆ పరిశోధనలో సావర్కర్ జీవితంలోని ఎన్నో చీకటి కోణాలను నూరాని కనుగొన్నారు. ఆ చీకటి కోణాలను పాఠకుల దృష్టికి తీసుకు వచ్చేందుకు నూరాని చేసిన ప్రయత్నమే 'సావర్కర్-హిందూత్వ'.

విషయ వివరణను సులభతరం చేసేందుకు రచయిత ఈ పుస్తకాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించారు. పుస్తకంలోని విషయాన్ని అంతటినీ మొదటి అధ్యాయంలో రేఖామాత్రంగా చర్చించి, వాటినే మిగిలిన అయిదు అధ్యాయాలలో వివరించారు. గాంధీజీ హత్యను, గాడ్సేని సమర్థిస్తూ ఆర్.ఎస్.ఎస్. అధికార పత్రిక 'ఆర్గనైజర్' రాసిన సంపాదకీయాన్ని, మరొక సందర్భంలో సావర్కర్‌ను భగత్‌సింగ్‌తో పోల్చుతూ వాజ్‌పేయి చేసిన ఉపన్యాసాన్ని కోట్ చేస్తూ, వాటి ఆధారంగానే పరివార్ భావ దారిద్ర్యాన్ని, మలిన రాజకీయాలను తన పదునైన విశ్లేషణలతో మొదటి అధ్యాయంలో రచయిత ఎండగట్టారు. 1857 తిరుగుబాటుపై రాయబడిన ప్రామాణిక గ్రంథాలలో సావర్కర్ రాసిన "ద ఫస్ట్ వార్ ఆఫ్ ఇండియన్



సావర్కర్-హిందూత్వ
గాడ్సే అనుబంధం
రచన : ఏ.జి.నూరాని; అనువాదం : శ్రీహరి;
వెల : రు.40/-;
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

ఇండిపెండెన్స్' ఒకటి. అందులో సావర్కర్ హిందూ ముస్లిం ఐక్యతను కాంక్షిస్తారు. తిరుగుబాటులో ముస్లింలు చేసిన అసాధారణ త్యాగాలను ప్రశంసిస్తారు. ఆ సద్గుణాలను గుర్తిస్తూనే, ఆ రచనలో హింస, రక్తపాతాల పట్ల సావర్కర్ ప్రదర్శించిన వ్యామోహాన్ని సరిగా ఎత్తి చూపారు నూరాని. అదే సావర్కర్ తన 'సిక్స్ గ్లోరియస్ ఎపోస్ ఆఫ్ ఇండియన్ హిస్టరీ' అనే పుస్తకంలో ముస్లింల పట్ల తీవ్రమైన శత్రుత్వాన్ని ప్రదర్శిస్తారు. రెండు పుస్తకాలు రాసిన మధ్యకాలంలో సావర్కర్ జాతీయతా దృక్పథంలో వచ్చిన మార్పులను నూరాని 'సావర్కర్ జాతీయవాదం' అనే రెండవ అధ్యాయంలో వివరిస్తారు.

సావర్కర్ జైలు జీవితం గురించి సంఘ్‌పరివార్ బాజాలు వాయిస్తుంటుంది. నిజానికి అండమాన్‌లో సావర్కర్ ప్రదర్శించిన నైతిక దిగజారుడుతనాన్ని, బ్రిటిష్ అధికారులకు లొంగిపోయి తన శిక్ష తీవ్రతను తగ్గించుకొనేందుకు, కొన్ని ప్రత్యేక సౌకర్యాలను పొందేందుకు చేసిన ప్రయత్నాలను మూడవ అధ్యాయంలో సోదాహరణంగా వివరిస్తారు. 'ప్రాదేశిక జాతీయ వాదం'ను తిరస్కరించిన సావర్కర్ 'సాంస్కృతిక జాతీయవాదం' పేరుతో హిందూ జాతీయోన్మాదానికి సైద్ధాంతిక ప్రాతిపదికను కల్పించిన విధానాన్ని 4వ అధ్యాయంలో మనం చూస్తాం.

'గాంధీజీ హత్య' అనే శీర్షిక గల అయిదవ అధ్యాయం సావర్కర్ గురించిన చేదు నిజాలను పాఠకులకు అందిస్తుంది. గాంధీజీ పట్ల, ఆయన లౌకిక విధానాల పట్ల సావర్కర్ పెంచుకొన్న వ్యతిరేకత సైద్ధాంతిక పరిధులను దాటి వ్యక్తిగత కక్షగా రూపుదాల్చుతుంది. నాథూరాంగాడ్సే, నారాయణ ఆప్టే, దిగంబర బాడ్గే తదితర హిందూమహాసభ కార్యకర్తలను హత్యకు ప్రేరేపించింది సావర్కరే అని అప్రూవర్‌గా మారిన బాడ్గే కోర్టులో వెల్లడించాడు. బాడ్గే ఇచ్చిన సాక్ష్యాన్ని గాంధీజీ హత్యకేసును విచారించిన న్యాయమూర్తి జస్టిస్ ఆత్మచరణ్ పూర్తిగా విశ్వసించారు. కాని 'అప్రూవర్ సాక్ష్యానికి స్వతంత్రమైన మద్దతు సాక్ష్యం లేదు' అనే న్యాయశాస్త్రపరమైన కారణంతో సావర్కర్ శిక్ష తప్పించుకొన్నారు. అయితే గాంధీజీ హత్యపై విచారణ జరిపిన జస్టిస్ జీవన్ కపూర్ కమిషన్‌కు ఆ స్వతంత్ర మద్దతు సాక్ష్యం లభించింది. సావర్కర్ బాడీగార్డ్ ఏ.ఆర్.కాసర్ కమిషన్ ముందు సాక్ష్యం చెప్పారు. అప్పటికే సావర్కర్ మరణించారు. అదేసాక్ష్యం కోర్టుకు లభించి ఉంటే సావర్కర్‌కు శిక్షపడి ఉండేది.

చివరి అధ్యాయంలో నూరాని గాంధీజీ హత్యానంతర పరిస్థితిని విశ్లేషించారు. సావర్కర్ రూపొందించిన హిందూత్వ రాజకీయాలను ఆర్.ఎస్.ఎస్., బి.జె.పి. ఎలా ముందుకు తీసుకు వెళ్తున్నాయో, అవి దేశ భవిష్యత్‌కు ఎంత ప్రమాదకరంగా పరిణమించనున్నాయో వివరించారు.

అనేక చారిత్రక గ్రంథాలను, డాక్యుమెంట్లను పరిశోధించి నూరాని తన రచనను పరిపుష్టం చేశారు. తను పేర్కొన్న అంశాలకు ఆధారాలను అదే పేజీలో ఫుట్‌నోట్‌గా ఇవ్వడం పుస్తకానికి విశ్వసనీయతను కలుగచేసింది. స్వాతంత్ర్యోద్యమానికి సావర్కర్ చేసిన ద్రోహాన్ని, భారత జాతీయతా చిహ్నంగా గాంధీజీని తొలగించి సావర్కర్‌ను ప్రతిష్టించేందుకు సంఘ్‌పరివార్ చేస్తున్న కుట్రలను అర్థం చేసుకోవాలనుకునే వారు తప్పకుండా చదవతగిన పుస్తకం ఇది. తెలుగు అనువాదం నిండా వున్న అచ్చుతప్పులు, అనేకచోట్ల అనువాదంలో దొర్లిన పొరపాట్లు పాఠకులకు ఇబ్బందిని కలుగజేస్తాయి. అనువాదంలో వాడిన భాష మరికొంత సరళంగా ఉంటే పాఠకులకు మరింత హాయిగా ఉండేది. ఎడిటింగ్‌లోనూ, అచ్చులోనూ, అనువాదంలో దొర్లిన లోపాలను ప్రచురణ కర్తలు మలి ముద్రణలో సవరించుకొంటే పాఠకులకు మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

- సు.మ.

అరవై ఆరు కళల్లో చిత్రలేఖనం ఒకటి. కేన్వాస్ పెయింటింగ్, నలుపు తెలుపు, కారికేచర్, కార్టూన్ ఇలా వివిధ ప్రక్రియల్లో ఆయా కళాకారులు తమ మనోభావాల్ని రంగు రంగుల చిత్రాలుగా ఆవిష్కరిస్తూ ఉంటారు. చిత్రకళలో తనకంటూ ప్రత్యేక శైలిని ఏర్పరచుకొని ఎందరో వర్ధమాన చిత్రకారులకు మార్గదర్శకమై మరెందరో ఔత్సాహిక కళాకారులకు శిక్షణనిస్తున్న పడవల నారాయణరావు చిత్ర విశేషాలను ఈవారం తెలుసుకుందాం.

పండుగలే 'పడవ' చిత్రాలకు ప్రేరణ

గుంటూరు జిల్లా చెరుకుపల్లి మండలం రాజవోలు గ్రామంలో 1949లో జన్మించిన నారాయణరావు స్కూల్ స్థాయినుండే చిత్రకళపై అభిరుచిని పెంచుకున్నారు. బొమ్మలపై ఆయనకున్న ఆసక్తిని గమనించిన ఆయన తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పదవ తరగతి అనంతరం మేనమామ చిట్టా శ్రీనివాసరావు వద్ద చిత్రకళలో శిక్షణ పొందారు. చిత్రకళపై శాస్త్రీయపరమైన పట్టు ఏర్పడిన అనంతరం తెనాలి టి.జె.పి.ఎస్ కళాశాలలో డ్రాయింగ్ టీచర్‌గా వృత్తిని ప్రారంభించారు. తెలుగువారి సంస్కృతిని తేటతెల్లంచేసే చిత్రాలను గీయడానికి ఉత్సాహం చూపే పడవల నారాయణరావు ఇప్పటికే వివిధ వర్ణాలతో పండుగలకు సంబంధించిన వేలాది చిత్రాలను గీశారు. చిత్రకళారంగంపై తనకున్న సుదీర్ఘానుభవాన్ని పదిమందితో పంచుకోవాలనే సదుద్దేశంతో చిత్రకళకు సంబంధించిన రెండు గ్రంథాలను కూడా ప్రచురించారు. ఔత్సాహిక చిత్రకారుల కోసం 1973 సంవత్సరంలో చిత్రకళానిలయాన్ని స్థాపించి ఇప్పటివరకూ 500 మందికి పైగా వర్ధమాన చిత్రకారులకు శిక్షణనిచ్చారు.

అవార్డులు..పురస్కారాలు

నారాయణరావు చిత్రాలలో పంటనూర్పిడి, చెట్టుకాడ ఎవరో, వసంతకోకిల, దసరా, నదీమాత మొదలైనవి బాగా పేరుపొందాయి. అలాగే శకుంతల, రామాయణంలోని పలు సన్నివేశాలు, మేఘమాల తదితర తైలవర్ణ చిత్రాలు కూడా ప్రముఖుల ప్రశంసలు పొందాయి. నారాయణరావు చిత్రకళకు చేసిన కృషికి గుర్తింపుగా 1997 సంవత్సరంలో జిల్లా స్థాయిలోను, 1998వ సంవత్సరం రాష్ట్ర స్థాయిలోను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డునిచ్చి ప్రభుత్వం సత్కరించింది. అలాగే జిల్లా, రాష్ట్ర స్థాయి చిత్రలేఖనా పోటీల్లో అనేక బహుమతులను, సత్కారాలను పొందారు. స్థానిక స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రతి ఏడాది తెనాలిలో ఆర్ట్ ఎగ్జిబిషన్లను నిర్వహిస్తూ వర్ధమాన కళాకారులను ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. చిత్రకళే నిత్యకృత్యంగా భావిస్తూ కళాకారులెందరికో మార్గదర్శకమవుతున్న నారాయణరావు మరిన్ని ఉత్తమ చిత్రాలను రూపొందించాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం. ●

నదీమాత

చెట్టుకాడ ఎవరో

వసంతకోకిల


పంటనూర్పిడి


మేఘవర్షిణి

* పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

ఆకాశంలో చీకటి చిక్క బడింది.

నక్షత్రాలు మిలమిల మెరుస్తున్నాయి. వాతావరణం ప్రశాంతంగా ఉంది. ఉండి ఉండి వీస్తున్న గాలి తెరలు తెరలుగా తగులుతుంటే ప్రభావతి ఆలోచనల్లోకి జారిపోయింది.

ఆకాశం మాదిరిగా ఆమె మనసులో కూడా చీకటి గూడు కట్టుకుంది. హృదయంలో వేదన, ఆవేదన పేరుకుపోతుంటే చూపుల్ని ఆకాశంలోకి మళ్ళించింది.

చీకట్లో చందమామ



తను, తన ఆకారం తలచుకుని దుఃఖించింది. ఏ పనీ చేయలేని అసక్తత విచారాన్ని కలిగించింది. చెక్కిళ్ళ మీద కన్నీళ్ళు అప్రయత్నంగా జారిపోయాయి. తుడుచుకుందామని మెదడు సంకేతాన్ని పంపించింది. చేతులు రాలేదు.

మరి ఆ ప్రయత్నం చేయలేదు.

వీధి వరండాలో కూర్చుంటే కాలనీలో క్రమ పద్ధతిలో ఇళ్ళన్నీ కనిపిస్తాయి. అందుకే సాయంత్రమవగానే దేక్కుంటూ ఆ వరండాలోకి రావడం ప్రభావతి నిత్యకృత్యం అయిపోయింది. తండ్రి బైరప్ప ఉద్యోగ బాధ్యతలు ముగించుకుని వచ్చేంతవరకూ ఒంటరిగా కూర్చుని ఎదురు చూడటం అలవాటు అయిపోయింది.

రాత్రి ఎనిమిది గంటలు అయ్యేసరికి వినిపించే సైకిల్ బెల్ కోసం ప్రభావతి చెవులు ఆతృతగా ఎదురు చూస్తుంటాయి. ఎంతదూరం నుంచైనా సైకిలు తొక్కుతూ వచ్చే తండ్రి బైరప్పను ఆమె గుర్తించగలదు.

సమయం ఎనిమిది అయింది కాబోలు. దూరంగా విద్యార్థుల గుంపు వస్తోంది. 'ట్యూషన్ పూర్తయింది కాబోలు' అనుకుంది ప్రభావతి. ప్రతిరోజూ వారు అదే సమయానికి తన ఇంటి ముందు రోడ్డు మీదుగా వెళుతుంటారు.

వారిని చూసినప్పుడల్లా ప్రభావతి మనస్సు కలుక్కుమంటుంది. 'ఎంచక్కా వారు స్కూలుకు వెళతారు... ప్రైవేటు క్లాసుల కోసం టీచర్ల ఇంటికి కూడా వెళతారు' అనుకుంది. తన అసక్తతకు మరోసారి దుఃఖం తన్నుకు వచ్చింది.

దూరంగా సైకిల్ మీద తండ్రి ఆకారం.

ప్రభావతిలో ఆలోచనలు పటాపంచలు అయిపోయాయి. మనసులో ఆనందం ప్రవేశించింది. "ఆ వచ్చేది కచ్చితంగా నాన్నే!" అనుకుంది.

ఇంతలో బైరప్ప ఇంటిముందు సైకిల్‌ను ఆపాడు.

"ఎందుకమ్మా ఒంటరిగా కూర్చుంటావు. గదిలో టీవీ చూడొచ్చు కదా?" అంటూ వరండాలో ఓ పక్క సైకిల్‌ను పెట్టి స్టాండు వేశాడు. తర్వాత కూతురు వద్దకు వచ్చి – "నీకేం తెచ్చానో తెలుసా? కోవా స్వీటు..." అంటూ

అప్యాయంగా లోనికి తీసుకు వెళ్ళాడు.

"నాన్నా! నాకు స్వీటు వద్దు. చదువు కావాలి. నేను అందరిలా స్కూలుకు వెళ్ళాలి. చదువుకోవాలి. నాకు అవన్నీ ఇస్తే వందల రకాల మిఠాయిలు ఇచ్చినట్లు!"

ప్రభావతి కళ్ళల్లో ఆశ... తండ్రి బైరప్ప హృదయంలో తుఫాన్‌లు రేపాయి. ఉప్పెనలా దుఃఖం తన్నుకు వచ్చింది. వడలిపోయి తోటకూర కాడలా వున్న కూతురు చేతిని తీసుకుని ఆర్తితో ముద్దు పెట్టుకున్నాడు... అప్రయత్నంగా అతని కళ్ళు వర్షించి ఆమె చేతులపై పడ్డాయి.

* * *

కర్నాటక రాష్ట్ర రాజధాని బెంగుళూరుకు దగ్గరగా ఉన్న 'ఏథకి' అనే చిన్న పల్లెలో ప్రభావతి ఉంటోంది. మూటలు మోస్తూ, చిన్నా చితకా పనులు చేసే కళాసి బైరప్పకు ఏకైక కుమార్తె. కూతురు పుట్టిందని తెలిసినప్పుడు ఇంటిలో మహాలక్ష్మి వెలసిందని పొంగిపోయాడు.

అందమైన గౌన్లు... కొత్త కొత్త బట్టలతో బుట్టబొమ్మగా తయారై చెంగుచెంగున గెంతే కూతుర్ని చూసి బైరప్ప మురిసిపోయేవాడు. కొడుకైనా కూతురైనా ఈ బంగారు తల్లేనని పొంగిపోయేవాడు. రెక్కలు ముక్కలు చేసుకుని పట్నంలో కళాసి పని చేసుకుంటూ కూతుర్ని పెంచి పెద్ద చేశాడు.

పదేళ్ళ వయసులో 'సెరిబ్రల్ పాల్సీ' అనే జబ్బు ప్రభావతికి సోకింది. అరుదుగా వచ్చే ఈ వ్యాధి ప్రభావతి జీవితాన్ని నాశనం చేసింది. ఈ వ్యాధి కారణంగా రెండు చేతులూ వంకర్లు తిరిగిపోయి రాయడానికి, ఏ పని చేయడానికి వీలు లేకుండా అయిపోయాయి. కాళ్ళతో రాయడానికి ప్రయత్నాలు మొదలు పెట్టింది. అవి కూడా క్రమంగా పని చేయడం మానేశాయి.

ఆ సమయంలోనే ప్రభావతి తల్లి చనిపోయింది. ఏ పనీ చేసుకోలేని ఒంటరి ఆడపిల్లకు తండ్రే దిక్కు అయ్యాడు. రోజూ వంట చేసుకుని కూతురుకు తినిపించి పనిలోకి వెళ్ళడం... రాత్రి ఎప్పుడో ఇంటికి చేరుకోవడం బైరప్ప నిత్యకృత్యం అయిపోయింది.

రోజంతా ఇంట్లో కూర్చోవడం.. రాత్రి తండ్రి రాకకోసం ఇంటి అరుగు మీద ఎదురు చూడటం ప్రభావతికి అలవాటు అయిపోయింది. రాత్రి తండ్రి తినిపించే అన్నం ఆమెకు అమృతం.. అన్నం తింటూ కబుర్లు చెబుతుంది. అలిసిపోయిన బైరప్ప నిద్రపోయేంత వరకూ టీవీలో వచ్చే సంగతులన్నీ పూసగుచ్చినట్లు వివరిస్తుంది.

* * *

టీవీలో వచ్చిన ఒక వార్తా కథనం ప్రభావతిలో చైతన్యాన్ని రగిలించింది. చేతులు రెండూ పని చేయకపోతే కాళ్ళతో రాయడం నేర్చుకుని పరీక్ష రాసిన ఒక అమ్మాయి ఉదంతం ఆమెను ఎంతో ప్రభావితం చేసింది.

రోజంతా నిరర్థకంగా గడపడం ఆమెకు ఎందుకో నచ్చలేదు. ఏదో చేయాలి... మరేదో సాధించాలి. అందరిలా విలక్షణంగా ఉండాలి అని మనసులో నిశ్చయించుకుంటుంది.

'సెరిబ్రల్ పోర్స్' వ్యాధి సోకకముందు నేర్చుకున్న పాఠాలు, రాసిన రాతలు గుర్తుకు వచ్చాయి. చచ్చుపడిపోయిన కాళ్ళు, చేతులు మాట వినవని తెలుసుకుంది. నోటితో పెన్ను పట్టుకోవడం అలవాటు చేసుకుంది. ముందు చాలా కష్టం అనిపించింది. రానురాను అలవాటు అయిపోయింది. అందరిలోనూ తాను విలక్షణంగా



ఉండాలని, అంగవైకల్యాన్ని అధిగమించాలని మనసులో ప్రతిజ్ఞ చేసింది.

టీవీకి దూరం అయింది.

రోజుకు పావుగంటతో మొదలైన ప్రాక్టీసు ప్రతిరోజూ అయిదు గంటల నిరంతర శ్రమ చేయడానికి సిద్ధపడింది. నోటితో పెన్ను పట్టుకుని రాయడం మొదలు పెట్టింది. మొదట ఎంతో కష్టం అనిపించింది. క్రమంగా అలవాటు అయింది. రాతపై పట్టు లభించింది.

పదవ తరగతి పరీక్ష కట్టి హాజరైంది. అందర్నీ ఆశ్చర్యపరిచే విధంగా 54 శాతం మార్కులతో పాసై టీచర్లను, డాక్టర్లను ఆశ్చర్యంలో ముంచెత్తింది. ప్రైవేటుగా ఇంటర్మీడియెట్ (పి.యు.సి.) పరీక్ష కూడా రాసింది.

కాగితం పూర్తయిన తర్వాత పేజీ తిప్పడం కాస్త కష్టం అనిపించినా రాయడం ఆమెకు శ్రమను కలిగించడం లేదు. పుస్తకాలు చదువుకుని పరీక్ష రాయడం ఆమెకు కష్టం అనిపించడం లేదు. ఇంకా ఇంకా ఉన్నత చదువులు చదవాలని, అందరిలో పేరు సంపాదించాలని ప్రభావతి తహతహలాడుతోంది.

చుట్టుపక్కల వారు, మురికివాడల్లో స్త్రీలు దరఖాస్తులు రాయించుకోవడానికి కూడా ఈమె వద్దకే వస్తుంటారు. నోటితో రాసే దరఖాస్తులకు తక్షణం మోక్షం లభిస్తుందని వారు నమ్ముతారు.

* * *

ఇంటి అరుగు మీద ప్రభావతి కూర్చొని తండ్రి బైరప్ప రాకకోసం ఎదురు చూస్తోంది. ఆకాశంలో చీకటి చిక్కబడింది.

ఆ రోజు యూనివర్సిటీ నుంచి వచ్చిన ఉత్తరం ప్రభావతి పక్కన ఉంది. కళాసి పని నుంచి తండ్రి ఎప్పుడు వస్తాడా, ఎప్పుడు ఆ ఉత్తరాన్ని చూపిద్దామా అని ఆమె మనసు ఆతృతగా ఎదురు చూస్తోంది.

డిగ్రీ పరీక్ష రాయడానికి ఆమె పెట్టుకున్న దరఖాస్తుకు వచ్చిన జవాబు ఆ ఉత్తరం. ఆమె సర్టిఫికెట్లను, దరఖాస్తును పరిశీలించి ఎటువంటి ఫీజు లేకుండా పరీక్షకు అనుమతిని మంజూరు చేశారు. నోటితో మాత్రమే రాయగలిగిన ఆమె ప్రతిభను అధికారులు గుర్తించి అరుదైన అవకాశాన్ని ఆమెకు కల్పించారు.

ప్రభావతి ఆ ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదివిందో తెలియదు. చదువుతున్న ప్రతిసారీ ఆమెకు కొత్త ఉత్తేజం కలుగుతోంది. తన కృషికి, పట్టుదలకు గుర్తింపు లభించిందని ఆమె ఆనందంతో పొంగిపోయింది.

తండ్రి బైరప్ప రాగానే ఉత్తరం సంగతి చెప్పింది. విప్పి చదివాడు.... నేల మీద ఆరాటంగా కూర్చున్న కూతుర్ని చూశాడు. మనసు ఆనందంతో ఉప్పొంగిపోయింది. చాలాసేపు మాటలు రాలేదు. "అమ్మా! అధికారులు నీకు కల్పించిన రాయితీ ఆర్థికమైనదే కావచ్చు. నైతికంగా నీకు ఎంతో మనోధైర్యాన్ని ఇస్తుంది.... చాలా సంతోషకరమైన వార్త చెప్పావు!" ఆమెను అభినందనల్లో ముంచెత్తాడు.

"నాన్నా! కోవా స్వీటు తెచ్చావా?"

"తెచ్చాను తల్లీ... రా లోపలికి.. ఇక్కడంతా చీకటిగా ఉంది. వరండాలో బల్బు కూడా మాడిపోయినట్లుంది.."

"కాసేపు ఇక్కడే కూర్చుంటాను... చీకటి అయినా పర్వాలేదు..."

చేతి సంచిలో నుంచి కోవాస్వీటు తీసి ప్రభావతితో తినిపించాడు.... బైరప్ప... ఆ తర్వాత మెల్లగా అన్నాడు... "అవునమ్మా! ఇక్కడ నాకూ చీకటి అనిపించడం లేదు.. నిజమే... అసలు చీకటి లేనట్లే ఉంది... ఎందుకంటే వెలుగురేఖలా నువ్వున్నావు కదా?" ప్రేమగా అన్నాడు.

ప్రభావతి ఆనందంగా నవ్వింది. ●

✻ కొండబాబు

ఎర్రిమొర్రి

"... 'మా అబ్బాయియా మీరూ ఒక్క పర్యాయం ఇంగిలీషు మాట్లాడండి బాబూ..' అని వెంకయ్యడిగితే.. "టక్కరి గిరీశం వెంకటేశం గాడితో మాట్లాడినట్లూ రాసేవాళ్లు ఉన్నారు" అన్నాడు సుబ్రహ్మణ్యం అగ్నిహోత్రావధాన్లు లాగ అసహనం ప్రదర్శిస్తూ.

"అవునవును.. అర్థంకాక 'ఈ ఆడుతున్న మాటలికి అర్థం యేంవిటండి' అనే అగ్నిహోత్రావధాన్లు లాంటి వాళ్లూ ఉన్నారు.." కైలాసం బదులిచ్చాడు.

"ఒట్టిగా అడిగేసి.. అమాయకంగా నమ్మేస్తే, అడిగిన వాడికీ, అడగని వాడికీ మధ్య పెద్ద తేడా ఏముంటుందంటావ్"

"...'ఇంగిలీషు వాళ్లదంతా అదో ఎర్రిమొర్రి." అని సరిపెట్టుకుంటున్న వాళ్లలాగే ఉంటారు

"ఇంతకీ ఇదంతా ఎందుకు చెబుతున్నావోయ్..." మళ్లీ జీర్ణంకాని పత్రికా పదాలనేమైనా పట్టుకొచ్చావా.."

"మరే.. పట్టుకు రావడం, ప్రశ్నించడం తప్ప పరిహరించడం ఎప్పటికి?"

"అబ్బా ఆది ప్రాసతో మాట్లాడేవోయ్.. కీపిటప్" మెచ్చుకున్నాడు కైలాసం.

చేయి విదిలించి మార్కు చేసిన కొన్ని పేపర్లను కైలాసం ముందు పెట్టాడు సుబ్రహ్మణ్యం. కొన్ని శీర్షికలు అవి.

విషం తాగి ఆత్మహత్య
పురుగుల మందు తాగి మృతి
విషాహారం తిని ఒకరి మృతి
కల్తీ సారా తాగి దుర్మరణం...

"ఏమిటీ మరణాలు.. దుర్మరణాలు..?"

"విషం తాగి మృతి చెందాడంటే అర్థం ఏమిటి? కావాలని.. విషం అని తెలిసిన పదార్థాన్ని తెచ్చుకుని తాగాడని కాదా! అర్థం.

'మరి కల్తీ సారా తాగి మృతి అర్థం ఏమిటి? ఇక్కడా అదే కదా అర్థం..?" ప్రశ్నించాడు సుబ్రహ్మణ్యం.

ఏదో తర్కం ఉందనిపించిందిగానీ.. వెంటనే అర్థం కాలేదు కైలాసానికి.

"చెప్పు" అన్నాడు.

"కల్తీ సారా అని తెలిసి తాగాడా? కాదే? కానప్పుడు కల్తీ సారా తాగి అని ఎందుకు రాయాలి? 'కల్తీ సారా కారణంగా' అని రాయాలి కదా! ఇంకా విపరీతం ఏమిటంటే 'విషం సేవించి ఆత్మహత్య' అని రాశారు చూడు ఈ పత్రికలో. వాడేదో బాధల్లో విషం తాగితే.. అది ఈ రాసినాయనకు సేవనం లాగా కనిపించిందట?" వ్యంగ్యమూ, అసహనమూ కలగలిపి అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఒప్పుకుంటానోయ్ సుబ్రహ్మణ్యం.. కానీ కాస్త ఛాదస్తంగా ఆలోచిస్తున్నావేమో చూడు.." అన్నాడు ఉడికిస్తూ.

"స్పష్టత కోరడం, స్పష్టంగా చెప్పాలనడం ఎప్పటికీ ఛాదస్తం కాదు.. పరిధులు.., పరిమితులు గుర్తించకుండా.. అర్థం చెడకుండా ఆ కొసరో ఈ కొసరో మాట్లాడితేనే ఛాదస్తమైనా, ఇంకేదైనా అంటారు.."

"సరదాకన్నాను బాబూ.. ఛాదస్తం అంటే మా రాంబాబు గాడికున్న లాంటిది.."

"ఎవరా రాంబాబు? ఏమా కథ?"

"మా ఆఫీసులోనే పనిచేస్తున్నాడు. ఒక రోడ్డు ప్రమాదం వార్తను ఒక విలేకరి 'బస్సు కింద పడి ఇద్దరి మృతి' అని రాసి పంపిస్తే వీడు 'బస్సు మీదుగా నడవడంతో మనుషుల మృతి' అని ఎడిట్ చేశాడు.

"ఇదేంటోయ్?" అన్నాడు.

బస్సు కింద పడితే మనుషులు ఎలా మరణిస్తారు? అని కిసుక్కుమన్నాడు.

బస్సు మీదుగా మనుషులు మాత్రం ఎలా నడుస్తారు? అని నేను ప్రశ్నించేసరికి బస్తీ వారి మీదుగా నడిచిందని వివరించబోయాడు. 'బస్సు మనుషులను తొక్కుకుంటూ వెళ్లడంతో ఇద్దరు మృతి' అని సుదీర్ఘంగా సవరించబోయాడు.

... అదీ రాంబాబు గాడి పైత్యం" అని ముగించాడు కైలాసం.

సుబ్రహ్మణం పెద్దగా నవ్వాడు.

"మనవాళ్లు కొందరు అర్థం లేకుండా చేసే భాషా పరిశీలన అలా ఉంటుంది మరి"

"అర్థపర్థం లేకుండా రాయడమే కాదు.. అర్థంలేని పరిశీలనా తప్పే" ఒప్పుకున్నాడు సుబ్రహ్మణ్యం.

"కాబట్టి.. ఈ సారి నేనే కొన్ని పదాల వాడుక ఎలా అర్థ విపరిణామాలకు దారితీస్తున్నదో చెప్తాను"

"గుడ్.. చెప్పు"

"నువు గతంలో చెప్పినట్లు.. చెప్పుచేతల్లో, అడుగుజాడల్లో పదాలులాగే విరమణ, ఉపసంహరణ లాంటి పదాలు, బెదిరింపు, హెచ్చరిక పదాలు, నిర్భాగ్యుడు, దుర్బలుడు లాంటివీ.. భావానికి తగినట్లు వాడడం లేదు"

ఈ పదాల భావం ప్రజలకు తెలుసు. తాము చెప్పాలనుకున్న భావాలకు పదాలు సమకూర్చుకోలేకే రాసేవాళ్లూ అలా రాయలేకపోతున్నారు. ఈ రంగంలో ఉన్న వారికి ఎక్కువ పద సంపద తెలిసుండాలి. అన్ని ప్రాంతాల ప్రజల వ్యవహారిక భాషను పరిశీలిస్తే ఆ సమస్య పరిష్కారమవుతుంది"

"సరే.. నువ్వు చెప్పిన పదాలను వివరించు ముందర"

"వచ్చే వారం... సరేనా?" ●

పాఠక స్పందన

సమస్యలు తెలియజేస్తుంది

సెప్టెంబర్ 7 ఆదివారం అనుబంధంలో ప్రచురించిన 'జీవనశైలి' దేశంలో వున్న సమస్యలు తెలియజేస్తుంది. నేను మీ శీర్షిక చదివిన తరువాత భారతదేశం బాగుపడాల్నంటే నేను కూడా నా వంతు కృషి చేయాలనిపించేలా బాగుంది. నేటి పాలకులు స్వప్రయోజనాల చూసుకుంటున్నారు తప్ప నా మాతృదేశానికి ఏమిచ్చాను అని ఆలోచించకపోవడం విచారకరం. సామ్రాజ్యవాద దేశాలకు, భారత మాతని తాకట్టు పెడుతున్నారు. మన దేశం బాగుపడాల్నంటే శాస్త్రవేత్తలు, మేధావులు, రాజకీయ నాయకులు తమ స్వప్రయోజనాలు వదిలితే బాగుంటుంది. ప్రజలు చైతన్యవంతులు కావాలంటే ఆర్థిక, సామాజిక, రాజకీయ, అసమానతలు పోవాలి. ఇవి జరగాలంటే ప్రజాపోరాటాల ద్వారానే సాధ్యం.

- **సోమ శైలజ**, ఇల్లందు, ఖమ్మం

ఆసక్తికరంగా రియల్ స్టోరీ

సెప్టెంబర్ 7 ఆదివారం అనుబంధంలో రియల్ స్టోరీ బాగుంది. ఈ శీర్షికలో ప్రచురించిన 'దయ్యాన్ని బట్టిన యువకులు' అనే కథ చాలా ఆసక్తికరంగా ఉంది. ఇలాంటి వాస్తవమైన విషయాలను సేకరించి రియల్‌స్టోరీ శీర్షికన ప్రచురిస్తున్నందుకు మీకు నా కృతజ్ఞతలు

- **ఎ.శివశంకర్**, చొప్పదండి, కరీంనగర్

ఫోకస్

పొట్టకూటికి పరుగులు
ఎన్నటికీ తప్పని అగచాట్లు

ఫోటో : కె.నరహరి

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా

అందరికీ అవసరమైన సమాచారమందించే

ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు

అర్ధసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761,
మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది